నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
బుధవారం 13 నవంబర్ 2024 www.navatelangana.com

సమగ్ర సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

• గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ



నవతెలంగాణ-మర్కుక్

సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యూమరేటర్లు, అధికారులు పకడ్బందీగా చేపట్టాలని గజ్వేల్ ఆర్డీవో వి.వి.ఎస్ చంద్రకళ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్-యూసుఫ్ ఖాన్ పల్లిలో ఈబీ నెం,10లోని మండల నోడల్ అధికారి, తహసీల్దారు అరిఫా, ఎంపీడీవో అఫ్జలుద్దీన్‌తో కలసి సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించి, ఆదికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మర్కుక్ మండలంలోని 16 గ్రామాలకు గాను 6749 కుటుంబాలకు గాను ఇప్పటి వరకు 16 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. సర్వేకు మండలంలోని ప్రజలందరూ ఎన్యూరేటర్లుకు సహకరించాలని సూచించారు. ఎన్యూరేటర్లు సర్వేను కోడ్ లను అధారంగా సర్వేను జాగ్రత్తగా నిర్వహించలన్నారు. గజ్వేల్ డివిజన్ పరిధిలో భూ సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మండలంలోని పాములపర్తి గ్రామంలో వర్గల్ పీఏసీఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు శ్రీధర్, యాదగిరి, ఐసీడీఎస్ సూపర్ వేజర్ దేబోరా రాణి, ఏఈవో రజని కాంత్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, రైతులు, తదితరులున్నారు.

పేద దళిత రైతుల భూముల్లో ఇండస్ట్రియల్ వద్దు



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

పేద రైతుల భూములలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేయవద్దని అక్కనపేట మండలంలోని చౌటపల్లి గ్రామ రైతులు మంగళవారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. 312 సర్వే నంబర్‌లో వందమంది పేద దళిత రైతు లం భూమిని దున్నుకుంటున్నామన్నారు. వ్యవసాయ చేసుకునే భూముల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో భూములు తీసుకోవద్దని కోరారు. జీవనాధారమైన భూములు ఆక్రమించడం వల్ల అనాధలం అవుతామని, తమ పిల్లల భవిష్యత్తు అంధకార మవుతుందని పేర్కొన్నారు. చౌట పల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ నిర్మించాలనే ఆలోచన విరమించుకోవాలని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గ్రామ రైతులు ఇల్లందుల జంపయ్య, ఆవుల పెద్ద వెంకటయ్య, వెల్ది రంగారావు ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయండి




నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పలు కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డిని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ కలిసి విజ్ఞప్తి చేశారు. జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం రోజున కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పటాన్ చెరు డివిజన్ పరిధిలో గల శాంతి నగర్, బండ్లగూడ, బాలాజీ నగర్,ఆల్విన్ కాలనీలలో రహదారులు ఈమధ్య పడ్డ వర్షానికి దెబ్బతిని పూర్తిగా పాడయ్యాయని దీనివల్ల ప్రజలుతీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఆ కాలనీల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణం అత్యంత అవసరమని.. అందుకోసం కోటి 20 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరారు.

జిల్లా కలెక్టర్, రెవిన్యూ అధికారులపై దాడి సిగ్గుచేటు

• దాడులు నిరసిస్తూ ఉద్యోగ సంఘాల నిరసన




నవతెలంగాణ-గజ్వేల్

పేదల సంక్షేమమే లక్ష్యంగా సేవలందిస్తున్న జిల్లా కలెక్టర్, ప్రభుత్వ అధికారులు, రెవిన్యూ సిబ్బందిపై దాడులు సిగ్గుచేటని, అయితే లగ్ చర్ల సంఘటనలో దాడి చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్‌లో మంగళవారం ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీఓస్ గజ్వేల్ డివిజన్ అధ్యక్షులు లింగం, రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రకళ, తహసీల్దార్ శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా, బొమ్మరాసిపేట్ మండలం, లాగ్ చెర్ల వద్ద జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు భూ సేకరణ నిమిత్తం గ్రామసభ నిర్వహించడానికి వెళ్లిన కలెక్టర్, కొడంగల్ అభివృద్ధి అథారిటీ అధికారి, తహసిల్దార్ తదితరులపై దాడి చేయడం, వాహనాలు ధ్వంసం చేయడం ఎంత మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే అధికారులు స్వేచ్ఛగా సేవలందిస్తారని, పనిచేయగలుగుతారని స్పష్టం చేశారు. రాజకీయ ప్రేరేపిత చర్యలతోనే ఉన్నతాధికారులపై దాడి జరిగినట్లు భావిస్తుండగా, తాము ప్రజలు, ప్రభుత్వం, నాయకులకెవరికి వ్యతిరేకం కాదని తెలిపారు. విధి నిర్వహణలో రాత్రనక, పగలనక ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా పనిచేస్తున్న ఉద్యోగులను వేధించడం, ఇబ్బందులకు గురిచేయడం, దాడులు చేయడం తగదని, మరీ మహిళా ఉద్యోగుల పరిస్థితి ఏమిటని నిలదీశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని, సోమవారం జరిగిన సంఘటన పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ తీవ్రంగా ఖండిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు రాజశేఖర రెడ్డి, భరత్, బిలాల్, శ్రవణ్, కృష్ణ, శ్రీధర్, వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలి

• జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్





నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-3 పరీక్షను అభ్యర్థులు ప్రశాంతమైన వాతావరణంలో రాసేలా అన్ని ఏర్పాట్లు చెయ్యాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ఆ పరీక్ష నిర్వహణకు సంభందించి చిప్ సూపరిండెంట్, డిపార్మెంట్ ఆఫీసర్, రూట్ ఆపిసర్లు, ప్లైయింగ్ స్క్వాడ్, పోలిస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా రిజినల్ కో ఆర్డినేటర్ విపి.రాజు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆ పరీక్ష నిర్వహణ గురించి క్లుప్తంగా వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 37 సెంటర్లలో 13,408 మంది అభ్యర్థులు గ్రూప్ 3 పరీక్ష రాయనున్నారని, ఆయా సబ్జెక్ట్‌ల వారీగా మూడు పేపర్లు నవంబర్ 17వ తేది ఉదయం 10 -12:30వరకు జనరల్ స్టడీస్ అండ్ జనరల్ అబిలిటి పేపర్-1, మధ్యాహ్నం 3- 5:30గంటల వరకు హిస్టరీ-పోలిటి-సోసైటి పెపర్-2, నవంబర్ 18వ తేది ఉదయం 10-12:30 గంటల వరకు ఎకానమీ డెవలప్మెంట్ పేపర్-3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చెయ్యాలని అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలో 4 రూట్ లుగా విభజన చేశాక రూట్ అధికారులు మీకు కేటాయించిన పరీక్ష కేంద్రాలను ఒక రోజు ముందే చూసుకోని ఏర్పాట్లు చేయాలి. అందరు అధికారులు సమన్వయంతో పరీక్ష నిర్వహణను విజయవంతం చేసెలా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు.

గజ్వేల్ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఏసీపీ

• వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ సందర్శన.
• గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

స్టేషన్ చుట్టూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. మంగళవారం వార్షిక తనిఖీల్లో భాగంగా గజ్వేల్ పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ చుట్టూ పరిసర ప్రాంతాలు, వివిధ నేరాల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలిం చమన్నారు. పోలీస్ సిబ్బందికి సర్వీస్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదిదా రులతో మర్యాదగా మాట్లాడాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ వచ్చే ప్రతి దరఖాస్తు దారునితో సంబంధిత సీఐలు మాట్లాడి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. సీజ్ చేసిన వాహనాలను సంబంధిత వాహన యజమానులకు సాధ్యమైనంత త్వరగా అందజేయాలని సూచించారు. వీపీఓ వ్యవస్థను మెరుగుపరచాలని వారంలో రెండు మూడు సార్లు గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రతి కేసులో పారదర్శకంగా పరిశోధన కొనసాగాలని తెలిపారు. గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూసుకోవాలని తెలిపారు. కేడీలు బీసీలు సస్పెక్ట్ లు రౌడీలపై మరింత నిఘా ఉంచాలన్నారు. అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దన్నారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ ప్రతిరోజునిర్వహించాలన్నారు. ముందస్తు సమాచారాన్ని సేకరించాలని, సైబర్ నేరాలు, తదితర అంశాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇసుక, పీడీఎస్ రైస్, గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఇన్స్పెక్టర్లు, సైదా, ముత్యంరాజు, ఎస్ఐలు యాదవ రెడ్డి, శంకర్, గజ్వేల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ తాజా మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి ఇటీవలే ఆయన వ్యవసాయ క్షేత్రంలో తేనెటీగల దాడిలో గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొంది.. కోలుకుని తిరిగి ఇంటికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మంగళవారం కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ భూమ్ రెడ్డి, గ్రామ రైతు సమన్వయత అధ్యక్షులు పిరయ్య, యువత అధ్యక్షుడు పండరి, నాయకులు నాగిరెడ్డి, గోపాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి, హనుమాన్లు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు చేరని చేపలు



నవతెలంగాణ-బెజ్జంకి

మత్స్యకారుల ఆర్థికా తోడ్పాటుకు అండగా నిలువాలనే గొప్ప సంకల్పంతో గత ప్రభుత్వం ఉచితంగా మండలంలోని తోటపల్లి ఆన్ లైన్ రిజర్వాయర్, బేగంపేట, గూడెం, బెజ్జంకి చెరువుల్లో ఉచితంగా చేపలు పంపిణీ చేసింది. రాష్ట్రంలో నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదికాలం దగ్గర పడుతున్న మండలంలోని చెరువులకు చేపపిల్లలు ఇంకా చేరుకోలేదు. వర్షాకాలం గడిచిపోయినా చేపపిల్లలు అందకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతూ ఉచిత చేపపిల్లల పంపిణీకి ఎదురుచూపులు చూస్తున్నారు. అదును దాటిన తర్వాత పంపిణీ చేస్తే చేపలు ఎదిగేందుకు సమయం లేక నష్టపోయే ప్రమాదం ఉందని చేపల వేటపై ఆధారపడి జీవించే మత్స్యకారులు చెరువులు, కుంటల్లోనే చేపపిల్లలపై అదారపడి జీవనం సాగిస్తున్నామని అవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆలస్యంగా చేపపిల్లలు అందజేస్తుండడంతో కుంటలు, చేరువుల్లో ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంటోందని చిన్న సైజు చేపపిల్లలు అందిస్తుండటంతో సీజన్ చివరి నాటికి కుంటలు, చేరువుల్లో నీరు ఇంకిపోయి పక్షులకు ఆహారంగా మారుతున్నాయని అవేదన వ్యక్తం చేస్తున్నారు.

• మండలంలో మత్స్యకారుల ఎదురుచూపులు
• అదును దాటుతుండటంతో మత్స్యకారుల్లో ఆందోళన

వర్షాలతో ఉపాధికి దెబ్బ

ఆకాలంగా కురుసిన వర్షాలు మత్స్యకారులు జీవనోపాధిపై దెబ్బ కొట్టాయి. వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండలా మారాయి. కనీసం ప్రభుత్వం పంపిణీ చేసే ఉచిత చేపపిల్లలైనా సకాలంలో అందిస్తే అధిక వర్షాలతో కలిగిన నష్టం భర్తీ అవుతుందని భావించిన మత్స్యకారులకు అధికారుల తీరు నిరాశే కలిగిస్తోంది.

ఎమ్మెల్యే ప్రత్యేక చోరవ చూపాలని

నియోజకవర్గంలోని ఇల్లంతకుంట, మానకొండూర్ మండలాల్లో పలు చేరువుల్లో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఉచితంగా చేపలు పంపిణీ చేసి బెజ్జంకి మండలంలో నిర్లక్ష్యం చేయడం వివక్ష చూపడమేనని పలువురు మత్స్యకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే ప్రత్యేక చోరవచూపి గత ప్రభుత్వం వలే అయా చెరువుల్లో ఉచితంగా చేపలు పంపిణీ చేసి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు

త్వరగా పంపిణీ చేయాలి




సీజన్ దాటి పోయాక ఉచితంగా చేపపిల్లలను అందిస్తే ప్రయోజనమే లేదు. ఇప్పుడు సీడ్ చెరువుల్లో వేస్తే చేపలు పెరగవు. మార్కెట్లో డిమాండున్న పిల్లలను పంపిణీ చేస్తే మత్స్యకారులకు మరింత లాభసాటిగా ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం మూలంగా ఏటా ఆలస్యంగా చేప విత్తనాలు అందుతున్నాయి. త్వరగా చేప పిల్లలను ఎమ్మెల్యే పంపిణీ చేయాలని విజ్ఞప్తి.

-కోర్వీ తిరుపతి ముదిరాజ్, బేగంపేట.

హైడ్రా పేరిట కాలయాపన

• పేదల ఇండ్లు కూలగొట్టి పెద్దలకు అప్పజెప్పడమే హైడ్రా డ్రామా
• సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు







నవతెలంగాణ-కొమురవెల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరిట హై డ్రామా చేస్తుందని, ప్రజలకిచ్చిన హామీలన్నీ పక్కన పెట్టి కాలయాపన చేస్తుందని, బీజేపీ లెక్కనే కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్ సంస్కృతినీ తీసుకురావడం సిగ్గుమాలిన చర్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. మంగళవారం కొమురవెల్లి మండలంలోని అయినాపూర్ గ్రామంలో ఆ పార్టీ 3వ మహాసభ జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి, అతిని శారద, తాడూరి రవీందర్‌ల అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభలో చుక్క రాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం బుల్డోజర్ వ్యవస్థను అమలు చేసినట్టే కాంగ్రెస్ హైడ్రా పేరిట పేదలను రోడ్ల మీదకు నెట్టేస్తున్నారని విమర్శించారు. పేదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే వాళ్ల ఇండ్లను కూలకొట్టడం సరికాదన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారంటీల అమలు అట్టకెక్కించి పుటకో మాట చెప్తు ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ, రైతు భీమా, పంటలకు మద్దతు ధర, 18ఏండ్లు దాటిన మహిళలకు రూ.2500, పింఛను పెంపు అనేక అంశాలను ప్రభుత్వం పక్కన పెట్టిందని విమర్శించారు. అనంతరం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ కొమురవెల్లి మండలంలో గ్రామ స్థాయి నుంచి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్ దాసరి ప్రశాంత్ మండల నాయకులు తేలు ఇస్తారి, తాడూరి మల్లేశం, చక్రపాణి, బాలస్వామి, ఎల్లయ్య, భరత్ ప్రశాంత్ విరమణీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమ కోసం ప్రత్యేక పూజలు


• రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ప్రజల సంక్షేమం కోసం శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతం పూజా కార్యక్రమాన్ని చేపట్టినట్లు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవా రం హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు పూజా కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్తీక మాసం సందర్భంగా ఏకాదశి పర్వదినాన నియోజకవర్గ ప్రజలంతా సర్వేజనా సుఖినోభవంతు అందరూ బాగుండాలని, శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించుకున్నమన్నారు. ప్రజలంతా వచ్చి సత్యనారాయణ స్వామి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే కాలంలో ఈ ప్రాంతమంతా సుభిక్షంగా పాడి పంటలతో మంచి వర్షాలతో ఆయు ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆ సత్యనా రాయణ స్వామి వేడుకున్నాట్లు తెలిపారు. కరీంనగర్ ,సిద్దిపేట జిల్లా కలెక్టర్లు పమేలా సత్పతి, మిక్కిలినేని మను చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్ ఆఫీసును తరలించొద్దని ఎంపీకి వినతి పత్రం



నవతెలంగాణ-సిద్ధిపేటకలెక్టరేట్

సిద్దిపేట పట్టణంలో ఉన్న ఈపీఎఫ్ కార్యాలయాన్ని తరలించొద్దని ఎంపీ రఘునందన్ రావుకు వినతి పత్రం అందించినట్లు హెచ్ఎంఎస్ సిద్దిపేట జిల్లా బీడీ కార్మిక సంఘం అధ్యక్షులు ఇదారి మల్లేశం తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ఓ కార్యాలయాన్ని సిద్దిపేట నుంచి తరలించాలని కేంద్ర ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడం చాలా బాధాకరమనీ, 2 లక్షలకు పైగా కార్మికులు ఖాతాదారులుగా ఉన్నారని, బీడీ రంగానికి సంబంధించిన పదవి విరమణ చేసి పెన్షన్ పొందుతున్న వృద్ధాప్య కార్మికులు 30 వేల మందికి పైగా కార్మికులు ఉన్నారని తెలిపారు. వీరు ప్రతి ఏడాది నవంబర్ నెలలో జీవన్ ప్రమాణ్ చేసుకోవడానికి సిద్దిపేట పట్టణంలోనే ఈపీఎఫ్ఓ కార్యాలయం అందుబాటులో ఉన్నదని, తరలించడం వల్ల కష్టమవు తుందని అన్నారు. కార్యాల యం సొంత భవనంలోనే ఉందని, ఇది అద్దే భవనం కాదని తెలిపారు. కార్యాలయం తరలకుండా చూస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మధు, కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా నాయకులు స్వామి, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ ట్రాక్ సైక్లింగ్‌కు జిల్లా సైక్లిస్టుల ఎంపిక



నవతెలంగాణ-సిద్దిపేట

ఈనెల 15 నుంచి 19 వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో జరిగే జాతీయస్థాయి ట్రాక్ సైకిల్ సైక్లింగ్ పోటీలకు జిల్లా నుంచి పలువురు సైక్లిస్టులు ఎంపిక కాగా, సిటిజన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు రూ.30 వేల ఆర్థిక సాయం చేసినట్లు సిద్దిపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండారుపల్లి శ్రీనివాసులు, జంగపల్లి వెంకట నర్సయ్యలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ హైదరాబాద్ సైక్లింగ్ అసోసియేషన్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి ట్రాక్ సైకిల్ ఛాంపియన్షిప్ పోటీలలో సిద్దిపేట క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయికి ఎంపికయ్యారని, సిద్దిపేటలోని ఖేలో ఇండియా సైకిలింగ్ సెంటర్లో శిక్షణ పొందుతున్న డి.వర్షిత, రిజ్వానా బేగం, కె.హర్షిత, సిహెచ్. సాయికుమార్, జి అభిషేక్ రెడ్డిలు ఎంపికయ్యారని తెలిపారు. వీరితో పాటుగా హుస్నాబాద్ కు చెందిన సురంపల్లీ సుమిట్, అమిత్, ఐలేని వరుణ్ రెడ్డిలు ఎంపికయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ సంజీవ్, సిటిజన్స్ క్లబ్ కార్యదర్శి బోనాల నరసింహులు, నాయి నర్సింహారెడ్డి, గుడాల సురేష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ మార్యరామదాస్ గౌడ్, సిటిజన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాలలో ముందు ఉండాలి

• మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-హుస్నాబాద్‌రూరల్

విద్యార్థులు ఎందులో తక్కువ కాదని అన్ని రంగాల్లో ముందుండాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం హుస్నాబాద్ బాయ్స్, గర్ల్స్ పాఠశాలలో స్వచ్ఛంధ సంస్థల సహకారంతో రోబోటిక్ ల్యాబ్ , సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లీష్ ల్యాబ్, మొబైల్ యాప్‌లను మంత్రి ప్రారంభించారు. రోబోటిక్ ల్యాబ్‌లో మిని రోబోలు ,సెన్సార్‌లతో తయారు చేసిన అధునాతన పరికరాలను, సైన్స్ ల్యాబ్‌లో పెరిస్కోప్, డిజిటల్ మైక్రో స్కోప్, డ్రోన్, టెలిస్కోప్, న్యూటన్ క్రడల్, మోటార్ డేయాన్స్టేషన్, మానవ శరీరంలో ఉండే అవయవాలు, హైడ్రో టర్బన్స్ తదితర 75 రకాల యాక్టివిటీస్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్‌లో పెరుగుతున్న సాంకేతిక గురించి సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి, మున్సిపల్ చైర్మెన్ ఆకుల రజిత వెంకన్న, కౌన్సిలర్లు , సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మెన్ లింగమూర్తి , ఆర్డీవో రామ్మూర్తి , ఎంఈవో , మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎమ్మార్వో రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు మరమ్మతులు చేయాలి

• కొత్తగా బీటీ రోడ్లు నిర్మాణం చేపట్టాలి
• నిర్లక్ష్యంగా ఉన్న అధికారుల పై చర్యలు తీసుకోవాలి
• సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు
• సంగారెడ్డి డిప్యూటీ ఎస్ఈకి వినతి



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా గుంతలమైన రోడ్లను వెంటనే బాగు చేయాలని, బీటీ రోడ్ల నిర్మాణం వెంటనే చేపట్టాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి డిప్యూటీ ఎస్ఈ అబ్దుల్ అలీకి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం జయరాజ్ మాట్లాడుతూ.. గత ఏడాది కాలంగా జిల్లా వ్యాప్తంగా అనేక రోడ్లు గుంతల మయమై ప్రజలు, రైతులు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో చెరకు, వడ్లు, పత్తి సీజన్ ప్రారంభమై రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నేషనల్ హైవే రోడ్లు, సదాశివపేట నుంచి సింగూరు, ఇతర గ్రామాల రోడ్లు, దౌల్తాబాద్ గణేష్ గడ్డ రోడ్డు,కంకోల్ రాయికోడ్ రోడ్, ఇంద్రశం వాటితో పాటు అనేక రోడ్లు అధ్వాన్నంగా గుంతలమయంగా మారి.. ప్రమాదాలు జరుగుతున్నా యన్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. లేనియెడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహులు, నాయకులు బి.యాదవ రెడ్డి,రాజయ్య,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతు మద్దతు ధర పొందాలి




• ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ వంటేరు నరేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ రాజమౌళి గుప్త, ఏఎంసీ వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్ లతో కలిసి మంగళవారం మున్సిపల్ పరిధిలోని జాలిగామ రోడ్డులోని శ్రీ వాసవి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. నాణ్యమైన పత్తికి రూ 7521/టి వరకు సిసిఐ కొనుగోలు చేస్తుండగా, సిసిఐ నిబంధనల మేరకు అన్నదాతలు కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించి ఆర్థికంగా ప్రయోజనం పొందాలని సూచించారు. అలాగే అధికారులు వరి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కోరారు. అయితే రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం కూడా విక్రయించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ సెక్రటరీ జాన్ వెస్లీ, ఏఎంసి డైరెక్టర్లు మహంకాళి శ్రీనివాస్ గుప్త, ఉప్పల శ్రీనివాస్, కరుణాకర్ రెడ్డి, డాక్టర్ వహీద్ ఖాన్, నర్సింహారెడ్డి, యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, మైనార్టీ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి అస్గర్, పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) మండల మహాసభను జయప్రదం చేయండి



• మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల కేంద్రంలోని ఈడెన్ గార్డెన్‌లో 16న జరిగే సీపీఐ(ఎం) మండల మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులకు మండల కార్యదర్శి కొంగరి వెంకటమావో పిలుపునిచ్చారు. మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న పార్టీ సీపీఐ(ఎం)అని నేడు రైతు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, మహిళలు, యువకులు, వివిధ రకాల వృత్తిదారులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. మన ప్రాంతం అస్తిత్వాన్ని కోల్పోయే విధంగా పాలకులు వ్యవహరించారని, రెవెన్యూ డివిజన్ కోసం ఏళ్ల తరబడి పోరాటాలు నిర్వహించాల్సి వస్తుందని, ఉన్న నియోజకవర్గాన్ని కోల్పోవడం జరిగిందని తిరిగి నియోజకవర్గాన్ని సాధించుకోవడం, చేర్యాల ప్రాంతంలో కోర్టు ఏర్పాటు, పెద్ద చెరువు మత్తడి స్థలాన్ని కాపాడుకోవడం కోసం ఇలాంటి అనేక పోరాటాలు గడిచిన కాలంలో సీపీఐ(ఎం) నిర్వహించిందని గుర్తు చేశారు. ఈ సమస్యల ను గుర్తించి రాబోయే రోజుల్లో పోరాడి సాధించుకునేందుకు ఈ మహాసభలు దోహదపడతాయని, ఈ మహాసభలను అత్యంత జయప్రదంగా నిర్వహించుకునేందుకు మండల ప్రజలు సహాయ, సహకారాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు గొర్రె శ్రీనివాస్, గ్రామ శాఖ కార్యదర్శి పండుగ యాదగిరి, బింగి బాలమల్లు, ఆది రామయ్య, వడ్లకొండ సత్తయ్య, కృష్ణయ్య, బూడిద వెంకటయ్య, చంటి, ప్రభాకర్, గుడ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో వికలాంగులను విస్మరించడం దుర్మార్గం

నవతెలంగాణ-జహీరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సమగ్ర సర్వేలో వికలాంగులకు సంబంధించి వివరాలను విస్మరించడం దుర్మార్గమని వికలాంగుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొనేటి నరసింహులు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక ఆర్డీఓకు మెమోరాండాన్ని అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వికలాంగుల్లో 25 రకాల వారు ఉన్నారని.. కానీ ఈ సర్వేలో వికలాంగులకు ఒకే కాలం కేటాయించారన్నారు. ఇది మంచి పరిణామం కాదన్నారు. తక్షణమే ఈ విషయమై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, అశ్వక్, మచందర్, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై అదనపు కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-సంగారెడ్డి



సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలిసి చర్చించారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్లక్ష్యం తగదని ధాన్యం కొనుగోలుకు రైతులకు అవసరమయ్యే అన్ని ఏర్పాట్లను చేయాలని అదనపు కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద బస్ షెల్టర్ లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ,బస్సుల కోసం రోడ్డుపైనే పడిగాపులు కస్తున్నారని వెంటనే షెల్టర్, మూత్రశాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సత్యనారాయణ వ్రతం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్హేర్

తాజా మాజీ జెడ్పీటీసీ నరసింహారెడ్డి ఇంట్లో మంగళవారం నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతం కార్యక్రమంలో ఖేడ్ మాజీ శాసనసభ్యులు మహా రెడ్డి భూపాల్‌రెడ్డి పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ భూమ్ రెడ్డి, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పిరయ్య, యువత అధ్యక్షుడు పండరి నాయకులు నాగిరెడ్డి,గోపాల్ రెడ్డి, హన్మాండ్లు, తదితరులు, పాల్గొన్నారు.



సాయి భాషాకు ఘన సన్మానం

నవతెలంగాణ-సంగారెడ్డి

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన సాయి భాషాను సంగారెడ్డి పట్టణ, పిఎంకె యువసేన నాయకులు మంగళవానం ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సాయి భాషా మాటాడుతూ.. తన పైన నమ్మకంతో ఈ బాధ్యతను ఇచ్చిన ఆర్ కృష్ణయ్యకి, రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణగౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థుల సమస్యలను అధికారులు నాయకుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరి స్తానని కానీ ఎడల పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలోని పిఎంకె యువసేన నాయకులు,జిల్లా విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న సమగ్ర సర్వే..

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని మిర్జాపూర్ (బి), మ్మరుజాపూర్, రాఘవపూర్, శంషో ల్లాపూర్, రేజింతల్, రామతీర్థం గ్రామాల్లో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వే కొనసాగుతున్నది. మంగళవారం రోజున అధికారులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి.. సమగ్ర రేషన్ కార్డు, ఆధార్ కార్డు, భూమి ఇంటి ఆస్తి వివరాలతో సేకరణ నమోదు చేశారు. ఈ సర్వేలో సూపర్వైజర్లు రాజ్ కుమార్, ఉపాధ్యాయులు, సర్వే అధికారులు పాండయ్య, అనిత, విజయకుమారి, సఫియా సుల్తానా తదితరులున్నారు.



మున్సిపల్ కార్మికుల డ్యూటీ డబ్బులు చెల్లించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

నారాయణఖేడ్ మున్సిపల్ కార్మికులకు ఎంపీ ఎన్నికల్లో డ్యూటీ చేసిన డబ్బులు చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికలు జరిగి నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు డ్యూటీ డబ్బులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే స్పందించి పెండింగ్లో ఉన్న డ్యూటీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజు, శకుంతల, చంద్రకళ, బేబీ తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎస్సైని సన్మానించిన నాయకులు

నవతెలంగాణ-మనూర్, నారాయణఖేడ్‌రూరల్

మనూరు పోలీసు స్టేషన్‌కు బదిలీపై వచ్చిన నూతన ఎస్ఐ కోటేశ్వరరావును కాంగ్రెస్ సీనియర్ నాయకులు రహీం, పండరి, నర్సింలు మంగళవారం శాలు వాతో సన్మానించారు. ఈ సందర్భంగా రహీమ్ మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్, చటాల పైన, మానవ హక్కుల పరిరక్షణ కోసం, బాల్య వివాహాల పైన ప్రజలకు అవగాహన కల్పించడం కోసం చర్చించినట్టు చెప్పారు. అదే విధంగా మండలంలో శాంతి భద్రతలు కాపాడాలని అందుకు అందరూ సహకరించాలని ఎస్ఐ కోరారు.



బీజేవైఎం మండల అధ్యక్షులుగా నియామకం

నవతెలంగాణ-న్యాల్‌కల్

బీజేవైఎం మండలాధ్యక్షులుగా విష్ణు నియామకమైనట్టు బీజేపీ మండలాధ్యక్షుడు ఓంకార్ తెలిపారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర నాయకులు గొల్ల భాస్కర్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీ శివాజీ పాటిల్ ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర నాయకులు మండలాధ్యక్షులకు విష్ణు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, నవీన్, రాహుల్, ఉన్నారు.

వీధికుక్కల స్వైర విహారం

భయాందోళనలో జనం..

- ఇప్పటికే ఎందరికో గాయాలు..
- మృత్యువాత పడుతున్న పశు సంపద

నవతెలంగాణ-మునిపల్లి





సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దారి పొడవునా నిలుస్తూ ప్రజలను భయపెడతున్నాయి. అంతేకాకుండా వాహనదారులపై సైతం దాడులు చేస్తున్నాయి. దాంతో ఇప్పటికే అనేకమంది తీవ్ర గాయాలపాలై ఆసు పత్రుల్లో చేరారు. ఏ వీధి చూసినా గుంపులు గుంపులుగా వీధి కుక్కలే కనిపిస్తుండడంతో.. ప్రజలు బయటికి వెళ్లాలంటే జంకుతున్నారు. చికెన్, మటన్ విక్రయించే కేంద్రాల వద్ద పడేసిన వ్యర్థాలను తింటూ.. రోడ్లపైనే గుంపులుగా సంచరిస్తున్నాయి.

మండలంలోని మేళాసంఘం గ్రామంలో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పలు వాహనాలపై వందలకు పైగా కుక్కలను తీసుకువచ్చి వదిలి వెళ్లారని ఎక్కడా చుసినా కొత్త కుక్కలు కనిపిస్తున్నాయని ఆ గ్రామస్తులు అంటున్నారు. వాటిని తమ గ్రామంలో వదిలిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరతున్నారు. అయితే ఇప్పటికే ఎంతోమంది కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రుల్లో చేరారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి.. వీధి కుక్క ల బెడద నుంచి తమను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

డ్యూటీ పోవాలంటే భయం వేస్తోంది



మా కంపెనీలో మూడు షిఫ్టులు ఉద్యోగానికి వెళ్లాల్సి ఉంటుంది. ఫస్ట్ షిఫ్ట్ వెళ్లాలంటే ఉదయం 6 గంటలకే వెళ్లాలి. ఆ సమయంలో వీధి కుక్కల భయం.. అలాగే సెకండ్ షిఫ్ట్ ఉద్యోగం చేసుకొని రావాలంటే రాత్రి 12 అవుతుంది. ఆ సమయంలో ఇంటికి వెళ్లాలంటే వీధి కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయో అని భయంతో బిక్కుబిక్కుమంటు వెళ్లాల్సి వస్తుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కుక్కల బెడద నుండి మమ్మల్ని కాపాడాలి.

-రాజు పటేల్, ఎంఆర్ఎఫ్ ఎంప్లాయ్

మా లేగదూడను కొరికి చంపాయి..



గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువైంది. మా పశువుల పాకలోకి కుక్కలు జొరబడి రెండేండ్ల వయస్సున్న లేగ దూడను కొరికి చంపేశాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి మమ్మల్ని.. పశువులను కాపాడాలి.

- బుడ్డొల్ల భాగయ్య, పశువుల కాపరి

రెండు మేక పిల్లల్ని ఎత్తుకెళ్లాయి

మేము రెండు మేకలు మేపుకుంటూ కూలీ పని చేసుకుంటాం. పొద్దంతా కూలి చేసి.. కూలి వద్ద మేకలను మేపి ఇంటికి వచ్చి వాటిని కట్టేసి లోపలికి వెళ్లేసరికి వాటికి పుట్టిన రెండు పిల్లల్ని వీధి కుక్కలు ఎత్తుకెళ్లాయి. దాంతో మేము సంవత్సరం అంతా పడిన కష్టం వ్యర్థమైంది.

-తలారి శ్రీశైలం, చిన్నకారు రైతు

ఇంట్లోకి చొరబడి 8 మేకపిల్లను ఎత్తుకెళ్లాయి



మా ఇంట్లో ఉన్న మేక పిల్లల్ని ఇంట్లోకి చొరబడి కుక్కలు ఎత్తుకెళ్తున్నాయి. నెలలు తరబడి కష్టపడి మేకలను పోషిస్తే అవి కాస్త కుక్కలకు ఆహారంగా మారుతున్నాయి. ఇప్పటికే 8 మేక పిల్లల్ని వీధి కుక్కలు ఎత్తుకెళ్లాయి. ఇప్పటికైనా అధికారులు కుక్కల నుంచి మా మేకలను కాపాడాలి.

- బ్యాగరి అంజయ్య, రైతు



జోనల్ స్థాయి క్రీడల్లో విద్యార్థికి అస్వస్థత

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ గురుకుల పాఠశాలలో జరుగుతున్న పదో జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ఓ విద్యార్థిని తీవ్ర అస్వస్థతకు గురైంది.రంజుల్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సంధ్యారాణి అనే విద్యార్థిని కబడ్డీ పోటీలో పాల్గొనడానికి వచ్చింది. ఆమె అస్వస్థకు గురికావడంతో గైడ్ టీచర్ ప్రణతి జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. డాక్టర్ సిద్ధార్థ ఆమెకు వైద్య చికిత్సలు చేశారు. శ్వాస ఎక్కువగా తీసుకోకవడంతో ఆమెకు ఆక్సిజన్ పెట్టారు. పరిస్థితి ఇబ్బందికరంగా ఏమీ లేదని డాక్టర్ ధృవీకరించారు.



పట్కరి సంఘం జోగిపేట అధ్యక్షులుగా నాగరాజు

నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట పట్కరి సంఘం జోగిపేట అధ్యక్షునిగా రత్నంపురి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులు రత్నపూరి చందర్, జగన్నాథం ఆధ్వర్యంలో మంగళవారంజరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా రత్నపూరీ సంతోష్ కుమార్, కార్యదర్శిగా రత్నపూరి గోపీనాథ్, సహా కార్యదర్శిగా పూజారి రమేష్, కోశాధికారిగా రత్నపురి భాస్కర్,సహాయ కోశాధికారిగా శ్రావణ్ మనోహర్, సలహాదారులుగా చవాన్ సిద్దేశ్,శ్రావణ్, నందు కుమార్ లను ఎన్నుకోవడం జరిగింది. అనంతరం సంఘం సభ్యులు నూతన సభ్యులను సన్మానించారు.

ఆరబెట్టిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్ మాధురి

నవతెలంగాణ-గుమ్మడిదల



రైతులను ఇబ్బంది పెట్టకుండా ఆరబెట్టుకున్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాస్‌రావుకు జిల్లా అదనపు కలెక్టర్ మాధురి సూచించారు. గుమ్మడిదల, నల్లవల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మండలంలో ఉన్న కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు సహకరించాల న్నారు. రైతులు ఎక్కడైనా ఇబ్బందులకు గురైతే వెంటనే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాభవాని, ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, మండల పరపతి సంఘం చైర్మెన్ నంద్యాల విష్ణువర్ధన్ రెడ్డి, సీఈవో లక్ష్మణ్ నాయక్, ఏఈఓలు రైతులు తదితరులున్నారు.

వియత్నాంకు విస్తరించిన గీతం అధ్యాపకుడి సేవలు

- హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలలో రెండు వారాల పాటు ఆతిథ్య ఉపన్యాసాలు

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఇంతవరకు పరిశోధనలు చేపట్టడానికి విదేశాలకు వెళుతున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యా లయం అధ్యాపకులు ఇప్పుడు తమ వృత్తి నైపుణ్యాన్ని విదేశీ విద్యార్థులతో కూడా పంచుకుంటున్నారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, హైదరాబాద్ లోని సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్ అప్పస్వామి కృత్రిమ మేథ (ఏఐ)పై ఈనెల 10 నుంచి 24వ తేదీ వరకు (రెండు వారాల పాటు) ఆతిథ్య ఉపన్యాసాలు ఇవ్వడానికి వియత్నాం హోచిమిన్ సిటీలోని వియెన్ డాంగ్ కళాశాలకు బయలుదేరి వెళ్లారు.అధ్యాపక వృత్తిలో 25 సంవత్సరాల బోధనానుభవం గడించిన డాక్టర్ నిరంజన్ గతంలో నవంబర్ 2022, 2023, రెండు విద్యా సంవత్సరాలలో రెండు వారాల పాటు వియెన్ డాంగ్ కళాశాల విద్యార్థులకు జావా, ఫ్లట్టర్ లో ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. విద్యాపరమైన సహకారాన్ని పెంపొందించడం, మెరుగుపరచడంలో ఆయన నిబద్ధత, నైపుణ్యాలు వియత్నాం విద్యార్థులపై నిస్సందేహంగా ప్రభావం చూపాయి. తన బోధనా బాధ్యతలతో పాటు, డాక్టర్ నిరంజన్ సైబర్ సెక్యూరిటీపై చేపట్టిన పరిశోధనా ప్రాజె క్టులో నిమగ్నమై ఉన్నారు. ఈ క్లిష్టమైన రంగంలో జ్ఞానా న్ని పెంపొందించడంలో తన అంకితభా వాన్ని ప్రదర్శిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్ లో పీహెచ్ డీని కలిగి ఉన్న ఆయన 21 పాఠ్యపుస్తకాలను రచించారు. ఐ ట్రిపుల్ ఈ సీనియర్ సభ్యు నిగా, 2024 ఐ ట్రిపుల్ ఈ కంప్యూటర్ సొసైటీ బెంగళూరు విభాగం కార్యనిర్వాహక సభ్యునిగా డాక్టర్ నిరంజన్ సాంకేతిక పురోగతి, సైబర్ సెక్యూరిటీపై అవగాహనను పెంపొందించడంలో కీలక భూమిక పోషిస్తున్నారు. అదే చాప్టర్‌లో సైబర్ సెక్యూరిటీ స్పెషల్ టెక్నికల్ కమ్యూనిటీకి కార్యదర్శిగా కూడా పనిచేస్తున్నారు. డాక్టర్ నిరంజన్ బహు ముఖ నైపు ణ్యాలు విద్యారంగానికి మించి విస్తరించాయి. పోర్ట్రెయిట్, నేచర్ ఫోటోగ్రఫీ అంటే మక్కువ చూపడంతో పాటు బలమైన నెట్ వర్కింగ్ సామర్థ్యాలు, సానుకూలతలు ఆయన బోధన, పరిశోధనా కార్యక్రమాలకు మరింత శోభని స్తున్నాయి. బహుముఖ ప్రజ్ఞతో కూడిన ఆయన అభిరుచి అంతర్జాతీయ విద్యార్థులకు అత్యాధునిక సాంకేతికతలకు పరిచయం చేయ డమేగాక వారిని అనుసంధానించడానికి కూడా తోడ్పడుతోంది.

ఇంటింటి సర్వేను పరిశీలించిన ఎంపీడీవో

నవతెలంగాణ-ఝరాసంగం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎంపీడీవో సుధాకర్ మంగళవారం పరిశీలించారు. సిద్ధాపూర్, చిలేపల్లి, చీలేపల్లి తాండాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వే తీరును, వివరాల నమోదును అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి వంటి అంశాలను వారాలలో తప్పులు లేకుండా క్షుణ్ణంగా నమోదు చేయాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. రోజువారీగా సువారు 300 వరకు వివిధ గ్రామాల నుండి దరఖాస్తులు వస్తున్నాయన్నారు. అధికారులు నమోదు చేసిన ఫారాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సేకరించి డాటాను ఆన్లైన్ చేయడానికి సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. డాటాను ఆన్లైన్ చేయడానికి కూడా ఆపరేటర్లను గుర్తించామన్నారు. ప్రభుత్వం నుండి ఆదేశాలు రాగానే సేకరించిన డాటాను ఆన్లైన్లో పొందుపరచడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఏపీవో రాజ్ కుమార్ తదితరులు ఉన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు తనిఖీ



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని కొత్తపల్లి, కానుకుంటలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జయశ్రీ రాజ్ మంగళవారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగులుకు సంబంధించిన రికార్డ్సను పరిశీలించి కేంద్రానికి వచ్చిన ధాన్యం వివరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయశ్రీ రాజ్ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగులు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించి కేంద్రానికి తీసుకు వచ్చి.. వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారి వద్ద టోకెన్ తీసుకోవాలని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు కొనుగోలు రశీదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం-శివకుమార్, సీసీలు కృష్ణ, మెహర్, బుక్ కీపర్లు- మాధవి, కల్పన, రైతులు కమిటీ సభ్యులు తదితరులున్నారు.

సర్వే పక్రియ పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-మనూర్



నాగలిగిద్ద మండలం పరిధిలో కొనసాగుతున్న కుటుంబ సమగ్ర సర్వే పక్రియను ఎంపీడీఓ మహేష్ రావు మంగళవారం పరిశీలించారు. దామర్‌గిద్ద, మోర్గి తదితర గ్రామాల్లో చేపట్టిన సర్వే గురించి అధికారులను అడిగి తెలుకున్నారు. తప్పులు జరుగకుండా ప్రతి విషయం కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకోవాలని సిబ్బందికి సూచించారు.

భూసారా పరీక్షలు చేసుకోవాలి

నవతెలంగాణ-జహీరాబాద్



రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేసుకోవాలని.. అందుకు అనుగుణంగానే పంటలు సాగు చేసి యాజమాన్య చర్యలు చేపట్టాలని భూసారా పరీక్ష నిపుణులు ఈ.స్వామి అన్నారు. న్యాల్కల్ మండలంలోని మెట్లకుంట గ్రామ రైతులకు భూసారా పరీక్షలు, లింగాకర్షణ బుట్టల ప్రదర్శన పైన గ్రామీణ వ్యవసాయ పని అనుభవ శిక్షణ కార్యక్రమంలో భాగంగా మల్లారెడ్డి వ్యవసాయ యూనివర్సిటీ నుంచి వచ్చిన విద్యార్థిణులతో అవగాహనా కల్పించారు. ముందుగా ఈ. స్వామి మాట్లాడుతూ.. రైతులు విచ్చలవిడిగా మోతాదుకు మించి రసాయన ఎరువులు వేయడం వల్ల భూమిలో పంటకు ఉపయోగ పడే సూక్ష్మజీవులు నిర్జీవం అవ్వడమే కాకుండా, భూమిలో పోషక లోపాలు ఎక్కువగా ఏర్పడుతున్నాయన్నారు. అంతేకాకుండా భూమి లో ఉదజని సూచిక ప్రభావం కూడా ఎక్కువ అవ్వడం వలన పంట దిగుబడులపైన ప్రభావం చూపుతుందన్నారు. అందుకే రైతులు పంట కోసిన వెంటనే గానీ పంట వేసే ముందు గానీ భూసారా పరీక్షలు చేసుకొని దాని ప్రకారం ఎరువులు వేస్తే మంచి దిగుబడులు పొందావచ్చునన్నారు. అనంతరం విద్యార్థిణులతో రైతులకు అర్థమయ్యే విధంగా పొలం నుంచి మట్టి నమూనా సేకరించే విధానం, కంది పంటలో వచ్చే శనగ పచ్చపురుగు నివారణలో భాగంగా లింగాకారక్షణ బుట్టల ప్రదర్శన వలన పురుగు ఏవిధంగా నివారించ వచ్చునో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో 10 మంది విధార్థిణులు, రైతులు ప్రభాకర్ రెడ్డి, నందిశ్వరరెడ్డి, షరీఫ్, ఇమ్రాన్, జనార్దనరెడ్డి, బక్కరెడ్డి, నర్సిములు, టీ. శ్రీకాంత్‌రెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, యస్.శ్రీకాంత్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బైపాస్‌రోడ్డు విస్తరణకు రూ.12కోట్లు మంజూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి పట్టణంలోని అల్విన్ బైపాస్‌రోడ్డును ఎనభై ఫీట్లుగా విస్తరించడానికి రూ.12 కోట్లను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి విడుదల చేయించారు. ఐబీ గెస్టహౌజ్ నుంచి నేషనల్ హైవే సమీపంలోని బసవేశ్వర విగ్రహం వరకు 2.5 కిలోమీటర్లు ఈ రహదారిని విస్తరించే క్రమంలో మంగళవారం జగ్గారెడ్డి సమీక్షించారు. మున్సిపల్, ఆర్‌అండ్‌బి, ఎలక్ట్రిసిటీ, హెచ్ఎండీఏ అధికారులతో కలిసి బైపాస్ రోడ్డులో పర్యటించారు. రోడ్డు మధ్యలో సింగిల్ స్టోన్‌తో డివైడర్ ఏర్పాటు చేయాలని, ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. రహదారి విస్తరణలో భాగంగా డబ్బాలను తాత్కాలికంగా తొలగించి, పనులు పూర్తికాగానే అదే చోట మళ్లీ డబ్బాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. 2.5కి.మీలు జగ్గారెడ్డి పాదయాత్ర చేస్తూ వ్యాపారులు, ప్రజల సలహాలు స్వీకరించారు. రహదారి విస్తరణ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి చెప్పారు. కాగా ఐబీగెస్ట్ నుండి బసవేశ్వర విగ్రహం వరకు ఆరుచోట్ల జంక్షన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బసవేశ్వర, శివాజీ, అంబేద్కర్, మహాత్మగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, రాజీవ్‌గాంధీల పేరిట ఈ జంక్షన్లు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ తోపాజీ అనంత కిషన్, కూన సంతోష్, షఫీ, కిరణ్ గౌడ్, శ్రీశైలం యాదవ్, మహేష్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పై దాడి హేయమైన చర్య

- నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-పటాన్‌చెరు



ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ కోసం వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో పాటు రెవెన్యూ అధికారులపై గ్రామ ప్రజలు దాడి చేయడం హేమమైన చర్య అని.. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పటాన్‌చెరు రెవెన్యూ ఉద్యోగులు అన్నారు. దాడిని ఖండిస్తూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉప తహసీల్దార్ సంతోష్ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాజా మాట్లాడుతూ.. ఒక జిల్లా కలెక్టర్ కే రక్షణ లేకుండాపోతే మిగతా ఉద్యోగులకు ఏమి రక్షణ ఉంటుందని వాపోయారు. అధికారులు కేవలం ప్రభుత్వం చెప్పిందే చేస్తారని అలాంటి ఉద్యోగులపై దాడులు చేయడం ఎంతవరకు సబబు అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే తాము ఎలాగా విధులు నిర్వహిస్తామన్నారు. దోషులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుదేరా గురుకుల విద్యార్థినులకు స్వర్ణం, రజత పతకాలు



నవతెలంగాణ-మునిపల్లి

హైదరాబాదులోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ వేదికగా నవంబర్ 9,10 తేదీల్లో జరిగిన ఇంటర్ కాలేజీ అథ్లెటిక్స్ టోర్నమెంట్ 2024-25లో మండలంలోని బుదేర చౌరస్తాలో గల సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఒక స్వర్ణ పతకం, నాలుగు రజత పతకాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఆనర్స్ గ్రూప్ జి.సౌజన్య 400 మీ. హర్డిల్స్‌లో ఒక స్వర్ణ పతకం, 4x400 మీ. రిలే టీమ్‌లో ద్వితీయ సంవత్సరం- బి.బి.ఏ. గ్రూప్ బి.కల్పన,ఆనర్స్ గ్రూప్ జి.సౌజన్య, జనరల్ గ్రూప్ ఏ.సంధ్యారాణి, తృతీయ సంవత్సరం బి.బి.ఏ. గ్రూప్ ఎం. అంకిత నాలుగు రజత పతకాలు సాధించారు. ఇటీవలే మృతి చెందిన ప్రిన్సిపాల్ అర్చనకు ఆ విజయాలను అంకితమిస్తున్నట్టుగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డా.జి.రమాదేవి తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శైలజ, మిగిలిన కళాశాల బృందం విద్యార్థినులకు అభినందనలు తెలిపారు.

ఏఐటీయూసీ 2వ మహాసభలు



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రంలో మంగళవారం ఏఐటీయూసీ రెండవ మహాసభలు జిల్లా ప్రధాన కార్యదర్శి సభాధ్యక్షులు అయ్యవారి లక్ష్మణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీడీ కార్మికుల సమస్యల పట్ల విఫలమయ్యారన్నారు. బీడీ కార్మికుల కంపెనీలను తరలించే ప్రయత్నం మానుకొని, జీఎస్టీ వ్యవస్థను తగ్గించి, బీడీ కార్మికుల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం బీడీ కార్మిక జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షురాలుగా జీడి బాల్ లక్ష్మి, ఉపాధ్యక్షులు సంతోష, ప్రధానకార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్, సహాయక కార్యదర్శి అయ్యవారి విష్ణు, కోశాధికారి తిరునహరి భాగ్య, ఏఐటీయుసీ రాష్ట్ర నాయకులు యూసఫ్, యేసు రత్నం, కేశవులు, నందం, అక్కిరెడ్డి రాజిరెడ్డి, కిష్టాపురం లక్ష్మణ్, ముక్రంవెంకటరాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఆవుల రాజిరెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి



నవతెలంగాణ-వెల్దుర్తి

టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి నాయనమ్మ రామమ్మ మరణించిన వార్త తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మంగళవారం మాసాయిపేట్ మండల కేంద్ర వాస్తవ్యుడు ఆవుల రాజిరెడ్డి స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనుషులు అన్నప్పుడు చావు పుట్టుకలు సహజమేనన్నారు. కాల వైపరీత్యాల రీత్యా చావు పుట్టుకలు భూలోకమున్నంత వరకు సహజ సిద్ధమే అన్నారు. అందుకు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. అయినా అందరి మధ్యలో కలుపుగోలుగా ఉంటూ ఒకేసారి మన మధ్యలో నుంచి వెళ్లిపోవడం బాధాకరమే అన్నారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మాజీ ఎంపీటీసీ మోహన్ రెడ్డి, మాసాయిపేట మండల మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు ఉన్నారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండల కేంద్రంలోని శిరిడి సాయిబాబా తొమ్మిదో వార్షికోత్సవాన్ని ఆలయ నిర్వాహకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ప్రారంభించారు. అనంతరం సాయిబాబా పల్లకి సేవ అఖండ దీపారాధన సాయిబాబా స్తోత్రం ఆలాపన భక్త జనాలు సాయిబాబాకు నీరాజనం పలికారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాయిబాబా ఆశీస్సులు అందరికి ఉండాలని బాబాను మనసారా కోరుకున్నట్లు అందరు సుఖసంతోషాలతో ఉండాలని అందులో నేనుండాలి అని అన్నారు. మహిళలతో కలిసి ప్రాంగణంలో హెూమం, అనంతరం కుంకుమార్చన నిర్వహించారు. ప్రజలు తండోపతండాలుగా వచ్చి వారి వారి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



మత్స్యకారుల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

నవతెలంగాణ-నిజాంపేట

మత్స్యకారుల అభివృద్దే ప్రభు త్వ ధ్యేయమని మత్స్య శాఖ సిబ్బంది అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలోని బ్రా హ్మణ చెరువు, సోమాజి చెరువుల లో 36,750 చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మత్స్య శాఖ సిబ్బంది మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందని మత్స్యశాఖ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమ లింగారెడ్డి, ఎఈఓ రాజు, మత్స్యశాఖ సిబ్బంది డేవిడ్ రాబర్ట్, చల్మెడ గ్రామ గంగపుత్ర సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి

- రాష్ట్ర అకాడమి పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులతో రాష్ట్ర అకాడమి పర్యవేక్షణ అధికారి వెంకటస్వామి.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య ఆధ్వర్యంలో మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నాయి అన్న భయంతో గురికాకుండా పట్టుదలతో ఉదయం సాయంత్రం ఇంటిదగ్గర ఎక్కువ సమయాన్ని తీసుకొని చదవాలని సూచించారు. ఉపాధ్యాయులకు తగు సూచనలు సలహాలు చేశారు. విద్యార్థుల అభివృద్ధికి విద్యార్థుల్లో పఠనాశక్తి కృషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, జయసుధ, శైలజ, పద్మజ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంటోజి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న పరంజ్యోతి



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణానికి చెందిన పెంటోజి ఆరోగ్య పరిస్థితి బాగోలేక నార్సింగ్ మండల ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు, విషయం తెలుసుకున్న చేగుంట ప్రజా సేవకుడు అయిత పరంజ్యోతి మంగళవారం నార్సింగ్ మండల హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పెంటోజిని పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితి విషయమై డాక్టర్లతో మాట్లాడారు. పెంట్రోజికి మెరుగైన వైద్యం అందించాలని, వైద్యానికి అయ్యే ఖర్చులు తమే బాధ్యత వహిస్తామని అయితే పరంజ్యోతి డాక్టర్లతో తెలిపారు.




10వ తరగతి విద్యార్థులకు వార్షిక ఫీజు దాత

- ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్

నవతెలంగాణ-తూప్రాన్

మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 29 మంది విద్యార్థులకు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో (హైదరాబాద్) దాతల సహకారంతో రూ.4045లు పరీక్ష ఫీజును దాత అసిస్టెంట్ ఇంజనీర్ విద్యుత్ శాఖ పేరుమళ్ల వెంకటలక్ష్మి సహకారంతో చెల్లించినట్లు ట్రస్ట్ అధ్యక్షులు మూడే రవి నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై మాసంలో కూడా ఈ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోటుపుస్తకాలు అందించామన్నారు. అదేవిధంగా మార్చిలో జరగబోయే వార్షిక పరీక్ష ఫీజును దాత వెంకటలక్ష్మి సహకారంతో చెల్లిస్తున్నామన్నారు. ఒక సామాజిక బాధ్యతగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకి నోటుపుస్తకాలు, వార్షిక పరీక్ష ఫీజు చెల్లిస్తున్నందుకు ట్రస్టు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు తరపున దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు యోహాన్, సరోజిని, జయ, ఉమాదేవి, శైలజ, మంజు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపీ రఘునందన్ రావుకు ఆహ్వానం

నవతెలంగాణ-చేగుంట

మండలంలోని సీఎంఆర్ కాలనీలో ఉన్న మోడల్ పాఠశాలలో నవంబర్ 16 తేదీ నుంచి 18 తేదీ వరకు అండర్ 14 బాల బాలికల రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలు జరుగనున్నాయి. మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఈ క్రీడలకు హాజరుకావాలనిఅ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు అయితే పరంజ్యోతి, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.అల్లి నరేష్ , తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో ట్రాఫిక్ తగ్గేదెలా..?

- పండుగలు మంగళవారం సంతతో రాకపోకలకు మంగళమే
- విస్తరణకే పరిమితమైన 50 ఫీట్ల రోడ్డు
- అభివృద్ధి చెందుతున్న తూప్రాన్‌లో ట్రాఫిక్ సమస్య తీరేదేల





నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా 50 ఫీట్ల రోడ్డును మున్సిపల్ అభివృద్ధి దృష్ట్యా గత ప్రభుత్వం విస్తరించింది. నూతన నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీ పట్టణం అభివృద్ధిని ఆకాంక్షించిన ప్రజల కోరిక మేరకు ఇరువైపులా 50 ఫీట్ల వెడల్పుతో రోడ్డును మున్సిపాలిటీ అధికారులు విస్తరించారు.కానీ నేటికీ ఏ కోశానా ఇరువైపులా 50 ఫీట్ల రోడ్డు కాస్త 20 నుంచి 30 ఫీట్ల రోడ్డుగా మారిపోయింది. ఒకేసారి రెండు లేన్లలో 2 వాహనాలు వెళ్లడానికి లేదు కదా కనీసం ఒక వాహనం ఒకే మార్గంలో పోవడానికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న సంఘటన తూప్రాన్ ప్రధాన రహదారిపై కనిపిస్తుంది. తూప్రాన్ పట్టణంలోని ప్రధాన రహదారిని చూస్తుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెద్దపెద్ద వెంచర్లలో వేసే తారు రోడ్ల కంటే వెడల్పు కంటే అధ్వానంగా తక్కువగా ఉన్నది.

చిరు వ్యాపారస్తులకు అడ్డగా మారిన విస్తరించిన రోడ్డు

రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారస్తులు పరిమితికి మించి రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ నియమ, నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రహదారిపై చిరు వ్యాపారాలు కొనసాగుతున్నాయి. ఈ రహదారిని ఆక్రమించుకోవడంతో ప్రధాన రహదారిపై వాహనదారులకు, కాలినడక బాటసారిలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సంత రోజున చిరు వ్యాపారులతో ట్రాఫిక్ జామ్

తూప్రాన్ పట్టణంలో ప్రతి మంగళవారం సంత జరుగుతుంది. సంత కారణంగా ప్రధాన రహదారిపై చిరు వ్యాపారులతో రోడ్డు పూర్తిగా దీంతో ప్రధాన రహదారిపై పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడి, ప్రయాణికుల, వాహనదారుల రాకపోకలకు తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయి. మంగళవారం తూప్రాన్ పట్టణ మీదుగా బస్సులు ఇతర వాహనాలు రావాలంటేనే ట్రాఫిక్ భయం కలిగే సందర్భాలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి ఇబ్బందికర ట్రాఫిక్ జామ్ సమస్యలు, సంఘటనలు అధికారులకు తెలిసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వ్యవహరిస్తున్నారు. మంగళవారం సంత రోజున పట్టణానికి పరిసర ప్రాంతాల గ్రామ ప్రజలు మార్కెట్ నిమిత్తం రావడంతో రద్దీ ఏర్పడి వాహనాదారులతో పాటు స్కూలుకు వెళ్లే విద్యార్థిని, విద్యార్థులకు, వృద్ధులకు, బస్సులకు, ఇతర వాహనదారులకు సైతం తీవ్రమైన ఇబ్బందులు కలుగుతున్నాయి.

తూప్రాన్ పట్టణ అభివృద్ధి పేరుతో విస్తరించిన రోడ్డు

తూప్రాన్ అభివృద్ధి దృష్ట్యా రోడ్డుకు ఇరువైపులా 50 ఫీట్ల రోడ్డు విస్తరించారు.అంతేకానీ! కోట్ల రూపాయల విలువ చేసే భవనాలను కూలగొట్టి విస్తరించిన రోడ్డులో చిరు వ్యాపారస్తులకు అడ్డాగా మారినట్లు పట్టణవాసులు వాపోతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వ నిధులతో లక్షల రూపాయల వెచ్చించి ప్రజల రాకపోకలకు ఫుట్ పాత్‌ను చక్కగా నిర్మించారు. కానీ ఈ ఫుట్ పాత్ అనేది వ్యాపారస్తులకు నిలయంగా మారింది. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు చూస్తూ ఉంటున్నారని ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

బస్సులు, ప్రయాణికులతో రద్దీగా మారిన తూప్రాన్ బస్టాండ్

44వ జాతీయ రహదారికి అనువుగా, హైదరాబాదుకు దగ్గరగా ఉన్న తూప్రాన్ పట్టణానికి ప్రతిరోజు హైదరాబాద్ నుంచి నిజామాబాద్, ఇతర ప్రాంతాల వరకు బస్సులు రాకపోకలు నిత్యం కొనసాగిస్తుంటాయి. బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలతో ప్రయాణికుల రద్దీ పెరగడంతో బస్టాండ్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. బస్టాండ్‌లో బస్సుల రద్దీ పెరగడంతో పాటు రోడ్డుపైకి బస్సులు వచ్చే సమయంలో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. బస్టాండ్ వద్ద ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలని ప్రయాణికులు, పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యేక మార్కెట్లను ఏర్పాటు చేయాలి

ప్రధాన రహదారిపై వ్యాపారం చేసే చిరు వ్యాపారులకు ప్రత్యేక మార్కెట్ స్థలాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. చిరు వ్యాపారస్తులు వ్యాపారం కొనసాగించేలా వారికి అండగా మున్సిపల్ అధికారులు ప్రత్యేకమైన వ్యాపార సముదాయాలను కేటాయించి వారికి వ్యాపారం కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలి, తూప్రాన్ పట్టణం నిరంతరం అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో రాబోవు రోజుల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడం, రోడ్డు ప్రమాదాలు జరగకుండా, సరైన సమయంలో ఇంటికి చేరుకోలేక ట్రాఫిక్‌లో ప్రయాణికులు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ ఉన్నతాధికారులు దీనిపైన దృష్టి సాధించి, ప్రత్యేకంగా చిన్న చిన్న మార్కెట్లను ఏర్పాటు చేసి చిరు వ్యాపారస్తులకు చేయూతనందించాలని తూప్రాన్ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య తీర్చడంతోపాటు చిరు వ్యాపారస్తులకు సహకరిస్తాం



తూప్రాన్ పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా సుమారు 100 కుటుంబాలకు పైగా చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగిస్తుంటారు కాబట్టి చిరు వ్యాపారం చేసుకుంటూనే పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా సహకరించాలని చిరు వ్యాపారస్తులకు సహకరించాలని సూచించారు. చిరు వ్యాపారస్తులకు దుకాణదారులు కూడా సహకరించాలని కోరారు. తూప్రాన్ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు భారీ ఎత్తున చిరు వ్యాపారాలు చేయుటకు పట్టడానికి వస్తుంటారు. వారు కూరగాయలు, పండ్లు, పూల దుకాణాలు వంటి చిరు వ్యాపారాలు నిత్యం కొనసాగిస్తుంటారు. కాబట్టి తూప్రాన్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉపాధి కల్పించే కేంద్రంగా తూప్రాన్ పట్టణం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణంలోకి భారీ వాహనాలు ప్రవేశించకుండా, జాతీయ రహదారిపై వెళ్లేటట్లుగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మున్సిపల్ చైర్ పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ

ట్రాఫిక్ కలగకుండా చిరు వ్యాపారస్తులు సహకరించాలి



పట్టణంలోని చిరు వ్యాపారస్తులు ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఏర్పడకుండా వాహనదారులకు ప్రయాణికులకు పట్టణ వాసులకు సహకరించాలని సూచించారు. గత వారం రోజుల క్రిందట చిరు వ్యాపారస్తులతో సమావేశం ఏర్పరిచి, ట్రాఫిక్ కలగకుండా సహకరించాలని సూచించామని తెలిపారు. పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఏర్పాటుచేసిన ఫుట్ పాత్ ఆనుకొని చిరు వ్యాపారులు తమ బండ్లను పెట్టుకొని వ్యాపారం చేయాలి. వ్యాపారస్తులు పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి

సమగ్ర కుటుంబ సర్వేపై సందేహాలు వద్దు

- కొల్చారంలో ఇంటింటి సర్వే ప్రక్రియ పర్యవేక్షణ
- మెదక్ జిల్లా కలెక్టర్



నవతెలంగాణ-కొల్చారం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ కులగణన సర్వేపై ఎలాంటి సందేహాలు, అపోహలు అవసరం లేదని, ప్రజలు సర్వే ప్రక్రియలో భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం కొల్చారంలో కుటుంబ సర్వేను సంబంధిత మండల అభివృద్ధి అధికారి కృష్ణవేణి, మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణతో కలిసి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సందర్శించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్యూమరేటర్‌లు నిర్వహిస్తోన్న సర్వే తీరును పరిశీలించి, ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సరైన విధంగా కుటుంబాల సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని సూచించారు. ప్రతి రోజూ సర్వే నివేదికలను సమర్పించాలని, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలని, కోడ్‌ల వారీగా ప్రతి ఫార్మ్‌ను క్షుణ్ణంగా, ఖచ్చితత్వంతో నమోదు చేయాలన్నారు. అలాగే సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, సర్వే మెటీరియల్ భద్రతకు స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేయాలని, తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఎన్యూమరేటలు పాల్గొన్నారు.

మెజిస్ట్రేట్ హెూదాలో ఉన్న కలెక్టర్‌పై దాడిని ఖండించిన తహశీల్దార్

- తహశీల్దార్ విజయలక్ష్మి




నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ రెవెన్యూ మండల కార్యాలయంలో తహశీల్దార్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫార్మా కంపెనీ ఏర్పాటు నిమిత్తమై ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణకు లగచర్ల ప్రాంతానికి వెళ్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతి జైన్ పై స్థానిక ప్రజలు తిరగబడి వ్యతిరేకం చేస్తూ నిరసనలు తెలుపుతూ కర్రలతో రాళ్లతో దాడి చేయడానికి తీవ్రంగా ఖండించారు. కలెక్టర్ పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉన్నతాధికారులు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. కాబట్టి ప్రజలు ప్రభుత్వాధికారులకు సహకారం అందించాలి, కానీ ఇలాంటి సంఘటనలకు ఉసిగొల్పకూడదని విమర్శించారు. ప్రతి జిల్లాకు కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్‌గా ఉంటారని తెలిపారు. ఒక జిల్లాలో ప్రభుత్వంలోని అన్ని శాఖలకు ప్రభుత్వాధినేతగా జిల్లా కలెక్టర్ విధులు నిర్వహిస్తారు. కాబట్టి ప్రభుత్వ ఉన్నతాధికారులపై దాడులు మానుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరేవేసి ఉన్నతమైన ఉద్యోగాలు చేస్తూ ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుంటారన్నారు. రెవెన్యూ మండల శాఖ కార్యాలయంలో కలెక్టర్ పై దాడిని ఖండిస్తూ డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్, ఆర్ఐలు, రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది నిరసన తెలిపారు.

2వ విడత ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు అవకాశం

- నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు పట్టపద్రులు
- ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు అవకాశం
- ఆర్డీవో జయచంద్ర రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలలో అర్హత కలిగిన అభ్యర్థులు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటరుగా నవంబర్ 23 నుంచి డిసెంబర్ 9 వరకు 2వ విడతలో దరఖాస్తు చేసుకోవాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మొదటి విడతలో 6, నవంబర్ 2024 తో ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు ప్రక్రియ ముగిసిన విషయం మొదటి విడతలో ఇప్పటి వరకు తూప్రాన్ డివిజన్‌లో పట్టబద్రులు 3013, ఉపాధ్యాయులు 271 ఎమ్మెల్సీ ఓటరు నమోదుకై దరఖా స్తుచేసుకు న్నారని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రా రెడ్డి తెలిపారు. దరఖా స్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఈఆర్వోగా ఓటర్ రిజిస్ట్రేషన్ బాధ్యతలు చూస్తున్న కరీంనగర్ డీఆర్ఓ 23 నవంబర్ 2024 రోజున ఎమ్మెల్సీ ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాలో ఏదైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు, మరోసారి కొత్తగా ఓటు నమోదుకు 23, నవంబర్ 2024 నుంచి 09 డిసెంబర్ 2024 లోపు దరఖాస్తు చేసుకోవడానికి అవకా శం కల్పించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవలసిందిగా అర్హత కలిగిన విద్యావంతులను, పట్టభద్రులను ఆర్డీవో జయచంద్ర రెడ్డి కోరారు.

వివాహా వేడుకకు హాజరైన మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధి గ్రామమైన జప్తి షివునూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చాంద్ పాషా కుమార్తె షేక్ షాహీన్, బాలా హుస్సేన్‌లకు అంగరంగ వైభవంగా జరిగిన వివాహానికి మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైనంపల్లి హన్మంతరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ గౌడ్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ షేక్ షరీఫ్, మాజీ ఉప సర్పంచ్ రుక్కుద్దీన్, మనోహరాబాద్ సర్పంచులు ఫోరం మాజీ అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, నగేష్ పాల్గొన్నారు.

ఎంపీపీఎస్ పులిగుట్ట తాండా పాఠశాలలో పుస్తక భాండాగారం ప్రారంభం

- జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్



నవతెలంగాణ-వెల్దుర్తి

మాసాయిపేట మండలం పరిధిలో పులిగుట్ట తండా ప్రాథమిక పాఠశాలకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో రూ.30 వేల విలువ గల విలువైన కథల పుస్తకాలను మంగళవారం ఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ శ్రీనివాస్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్‌కు అందజేశారు. పాఠశాలలోని ఓ గదిని పుస్తకాల బండాగారంగా మార్చి మాసాయిపేట ఎంఈఓ లీలావతి వెల్దుర్తి మండ ల ఎంఈఓ యాదగిరి మాజీ సర్పంచ్ మోహన్‌లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా విద్యాధికారి లీలావతి మాట్లాడారు. పుస్తకం హస్తభూషణం అని తెలుపుతూ బంగారు ఆభరణాల కంటే కూడా చేతిలో ఉన్న పుస్తకం మనకు అందాన్ని, విలువల్ని పెంచుతాయన్నారు. జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ రోజుల్లో సెల్ ఫోన్‌లకు అలవాటు పడిన విద్యార్థులు పుస్తకాలకు దూరమై పట్టణ శక్తిని కోల్పోతున్నారన్నారు. ప్రవాస భారతీయ వాసవి సంఘం వారు అందించిన పుస్తకాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు ధర్మ మాట్లాడుతూ ప్రవాస భారతీయ వాసవి సంఘం పులిగుట్ట తాండ పాఠశాలకు విలువైన పుస్తకాలను పంపి పాఠశాల అభివృద్ధికి పిల్లల్లో పుస్తకాల పట్టణ శక్తి పెంపొందించడానికి కృషి చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. విలువైన పుస్తకాలు అందించిన పుస్తక మిత్ర బృందానికి పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తున్న జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ శ్రీ భారతికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నవీన్ శంకర్ ప్రజలు మాజీ సర్పంచ్ మోహన్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సిరిపి శంకర్, వాలంటరీ పోచాలు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృష్టిని పెంచుదాం.. సమాజ ప్రగతికి తోడ్పడుదాం

- నాలుకపై మంటలు లేపుతున్న నరేష్




నవతెలంగాణ-వెల్దుర్తి

శాస్త్రీయ దృష్టిని పెంచడం సమాజ ప్రగతికి తోడ్పడదామని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మూఢనమ్మకాలపై విద్యార్థులకు వెల్దుర్తి ఎస్సై రాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ ఆధ్వర్యంలో వెల్దుర్తి పోలీస్ శాఖ పరివేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేష్ విద్యార్థిని విద్యార్థులకు డ్రగ్స్, వ్యక్తిత్వ వికాసం, సైన్స్, మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎస్సై రాజు హాజరై మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలను విద్యార్థులు వదిలిపెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలన్నారు. దొంగ స్వాములు, భూత వైద్యులు, ప్రజల అమా య కత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా, మోసం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మూఢ నమ్మకాలు లేని శాస్త్రీయ సమాజా నిర్మాణానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు బాల్య వివాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉప్పు నేటి నరేష్ మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగివున్న రహస్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, సాదక్ మియా పోలీస్ సిబ్బంది, అధ్యాపక బృందం, పాల్గొన్నారు.

వికారాబాద్ కలెక్టర్ పై దాడిని ఖండించిన ఆర్డిఓ

- ఆర్డిఓ జయచంద్ర రెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

వికారాబాద్ జిల్లా కలెక్టర్ పై చేసిన దాడిని ఖండిస్తూ తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డిఓ జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్ ఉద్యోగులు మంగళవారం నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలోని అన్ని కార్యవర్గ సంఘాల పిలుపు మేరకు నిన్న వికారాబాద్ జిల్లాలోని లగచర్ల ఫార్మా సిటీ కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం రెవిన్యూ అధికారులు వెళ్ళగా స్థానిక ప్రజలు అధికారులపై దాడి జరిపిన సంఘటనను నిరసిస్తూ, ఆ ఘటనలో గాయపడ్డ అధికారులకు సంఘీభావంగా తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవోతో పాటు రెవెన్యూ డివిజనల్ ఉద్యోగులు, సిబ్బంది నల్ల బాడ్జిలను ధరించి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుంటే అక్కడి ప్రజలు తెలిసో, తెలియకో ఉద్యోగులపై దాడి చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. ఈ చర్యను తీవ్రంగా ఖండించారు. సమాజంలో, ప్రభుత్వంలో జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వారికి ఎంతో గౌరవం, జిల్లాలోని మెజిస్ట్రేట్ హెూదాలో విధులు నిర్వహిస్తారని గుర్తు చేశారు.కానీ ఈ సంఘటనతో కలెక్టర్ స్థాయిని దిగజార్చినట్లుగా భావిస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్లే జిల్లాకు ప్రథమ పౌరులు, మెజిస్ట్రేట్‌గా ఉంటారని తెలిపారు. ఆ స్థాయి ఉద్యోగులను అగౌరవపరిచే విధంగా ప్రజలు చేయకూడదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే బాధ్యతను ప్రభుత్వ ఉద్యోగులు, కలెక్టర్లు తీసుకుంటారని, ప్రభుత్వ అధికారులను ఇబ్బందులకు గురి చేయొద్దని ప్రజలకు ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డయాబెటిస్ పరీక్షలు



నవతెలంగాణ-చేగుంట

మండలం కేజీఎస్ ఆస్పత్రి లైన్స్ క్లబ్ ఆధ్వర్యం లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ నగేష్ పంపాటి, 320డీ జిల్లా కార్యదర్శి డాక్టర్ అనంతరెడ్డి ఆదేశాల మేరకు మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంగళవారం కేజీఎస్ ఆసుపత్రిలో 13 మందికి డయాబెటిస్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ బుర్క నాగరాజు, సెక్రటరీ రజన కు రామచంద్రం, ట్రెజరర్ న్యలపల్లి సతీష్, పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మిక తెలుగు దినపత్రిక
4
సిద్దిపేట
బుధవారం | 13 నవంబర్ 2024 | www.navatelangana.com

ఎర్రవల్లిలో ఉచిత పశు వైద్య శిబిరం



నవతెలంగాణ-మర్కుక్

మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్క్యుక్ మండల పశువైద్యాధికారి డాక్టర్ శిరీష మాట్లాడుతూ జిల్లా పశు గణాభివృద్ధి రైతులు సదా అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకొని పశుసంపదను పెంచుకొని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఉచిత పశువైద్య శిబిరంలో32- పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, 4-గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు, 5-గర్భధారణ సూదులు, 23-సాధారణ చికిత్సలు, 35- దూడలకు నట్టల మందులు, 46 నల్ల పశువులకు, 54- తెల్ల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలుఅందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జెస్సీ, జెవిఓ మధుర, గోపాలమిత్ర, సూపర్ వేజర్ భాస్కర్ గౌడ్, గోపాలమిత్రలు రవీందర్, గ్రామ పాడి రైతులు యాదగిరి, కనకయ్య, నరసింహారెడ్డి, వెంకటేష్, సత్తయ్య, కరుణాకర్, శ్రీశైలం, పాడి రైతులు, తదితరులున్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-బెజ్జంకి

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డ్ ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరధిలోని గుండారం గ్రామ సీపీఐ(ఎం)సమావేశం నిర్వహించారు. హమాలీ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలను విస్మరించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంక్షేమ బోర్డ్ ఏర్పాటు చేసి కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని శ్రీనివాస్ కోరారు. మద్ది మల్లేశం, ఎలుక సంపత్, కొంరయ్య, రాజు, వెంకటేష్, అజయ్, అజ్జి కిరణ్, మొండయ్య, మహేశ్, ఉదయ్, పత్తి రమేశ్, శ్రీనివాస్, శివాజీ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి, గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వల్లంపట్ల గ్రామంలో కొనసాగుతున్న ఇంటింటి సమగ్ర సర్వేను మద్దూరు ఎంపీడీవో రామ్మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటా అయిన ధాన్యాన్ని వెంటనే నిర్వాహకులు లారీల ద్వారా రైస్ మిల్లులకు వెంటనే పంపించాలని సూచించినట్లు తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని సర్వేను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్స్ మాధవ్, కిరణ్, చంద్రశేఖర్ జూనియర్ అసిస్టెంట్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు

అధికారులపై దాడి చేయడం సరికాదు



నవతెలంగాణ-సిద్దిపేట/సిద్దిపేటకలెక్టరేట్

వికారాబాద్ జిల్లా కలెక్టర్, అధికారుల పైన జరిగిన దాడిని ఖండిస్తున్నామని, అధికారులపై దాడి చేయడం సరికాదని ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షులు పొన్నమళ్ళ యాదగిరి అన్నారు. జిల్లా ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపి, జిల్లా అదనపు కలెక్టర్ కి మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు కనకరాజు, కపిల్ రెడ్డి, నాగరాజు, అరుణాకర్, బిక్షపతి, రాంచెంద్రం, చెట్లపల్లి రాజు, అభిలాష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పై జరిగిన దాడి పట్ల నిరసన



నవతెలంగాణ-చేర్యాల

వికారాబాద్ కలెక్టర్, రెవిన్యూ ఉద్యోగులపై సోమ వారం జరిగిన దాడిని ఖండి స్తూ ట్రేసా పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ మహమ్మద్ సమీర్ ఖాన్ తోపాటు రెవిన్యూ ఉద్యోగులు, సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ప్రజా సంకల్ప దీక్ష

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఈ నెల 30న జరిగే ప్రజా సంకల్ప దీక్షను జయప్రదం చేయాలని జేఏసీ చైర్మెన్ రామగళ్ల పరమేశ్వర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ ఆకాంక్ష నెరవేర్చడం కోసం జరిగే ప్రజా సంకల్ప దీక్ష విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ నిర్మాణం

- గ్రామాధ్యక్షుడిగా మంకాల స్వామి



నవతెలంగాణ-బెజ్జంకి

మండల పరిధిలోని వడ్లూర్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గ నిర్మాణం చేపట్టినట్టు మంగళవారం మండల ఇంచార్జీ చింతకింది పర్శరాములు తెలిపారు. గ్రామాధ్యక్షుడిగా మంకాల స్వామి, ఉపాధ్యక్షుడిగా బెజ్జంకి వేమన, ప్రధాన కార్యదర్శులుగా కొమ్ము లక్ష్మణ్, బెజ్జంకి రమేశ్, సహాయ కార్యదర్శులుగా రాగటి రాజేశ్ కుమార్, బెజ్జంకి అనిల్, కోశాధికారిగా జంగపెల్లి సంతోష్, కార్యదర్శిగా బెజ్జం కిరణ్, రాగటి మహేందర్, కార్యవర్గం సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు పర్శరాములు తెలిపారు. మండల ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కావడం జరిగిందని మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం అక్బర్‌పేట- భూంపల్లి మండలం మోతే గ్రామంలో సీఎంఆర్ చెక్కులను ఆయన లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దుబ్బాక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ సీఎంఆర్ఎఫ్ ద్వారా డబ్బులు అందించామన్నారు. వడ్డే సంపంగి మల్లేశం.రూ.60వేలు, చాకలి లచ్చయ్య రూ.24వేలు, సిద్రమైన కరుణాకర్ రూ.17,500, మరుపల్లి రాజా గౌడ్ రూ.12వేలు, వీరికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొరేం రాజేశ్వర్ కమ్మ రవి, మాయ చంద్రం, ఎం. బాల్ నరస గౌడ్. బి.రామస్వామి, సోలిపేట నరేష్ రెడ్డి, సిహెచ్. మైపాల్ రెడ్డి, డా॥ నరసింహారెడ్డి, ఎస్. రమేష్ బుచ్చులు, రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల బెడద తగ్గేదెలా..?

- వ్యాక్సిన్ పూర్తిస్థాయిలో అమలుకు వేడుకోలు





నవతెలంగాణ-గజ్వేల్

గ్రామాలు, పట్టణాల్లో కుక్కల బెడద రోజురోజుకు భయాందోళనకు గురిచేస్తుంది. కుక్కలకు చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ప్రజలు గల్లీలో కాలినడకన వెళ్లాలంటే భయపడుతున్నారు. గుంపులుగా కుక్కల సంచరించడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటున్నారని భయపడుతున్నారు. కుక్కల కట్టడికే అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ పూర్తిస్థాయిలో అన్ని వార్డులో అన్ని గ్రామాల్లో చర్యలు తీసుకోవడం లేదు. తాజాగా గజ్వేల్ మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడి పల్లి భాస్కర్ రోజు మాదిరిగానే వాకింగ్ వెళ్లడంతో మార్గమధ్యంలో కుక్కలు గాయపరిచాయి. ఎక్కువగా పిల్లలు వాటి బారిన పడుతున్నారు. ఇటీవల ప్రజ్ఞాపూర్ లో ఊర చెరువు వద్ద చిన్నారులపై దాడి చేసి గాయపరిచాయి. దాదాపు 12 మంది తీవ్ర గాయాలకు గురయ్యారు. అంతేకాకుండా ఎక్కువగా కాలనీ, గ్రామాల్లో కొత్త వ్యక్తులు కనిపిస్తే వస్తు దాడికి పాల్పడుతున్నాయి. ఉదయం, రాత్రి సమయంలో కాలిన నడకకు వెళ్లే వాళ్ళు కుక్కల కారణంగా భయంతో ముందుకు సాగుతున్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. సిద్దిపేట జిల్లాలో ఏటా కుక్కల దాడిలో గాయాలు అవుతున్న వారు సుమారు 5 వేల పైగానే ఉంటున్నారు. గ్రామాలతో పాటు మున్సిపాలిటీలో సైతం కుక్కల బెడద తీవ్రంగా ఉందనే చెప్పాలి. పట్టణాలు, గ్రామాల శివారు ప్రాంతంలో కోళ్ల వ్యర్థ పదార్థాలు, కోళ్ల ఫారాల్లో చనిపోయిన కోళ్లను పడేస్తున్నారు. కుక్కలు వాటిని తీసుకొని మాంసం రుచికి మరుగుతున్నాయి. కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసి వాటిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో కొంతవరకు ప్రయత్నం చేసిన పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలని కోరుతున్నారు. గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక, నర్సాపూర్, చేర్యాల, హుస్నాబాద్ తదితర చోట్ల రోజుకో సంఘటన చోటు చేసుకుంటుంది. కోహెడ మండలంలో వీధి కుక్కలు స్కూల్ పిల్లలు పాఠశాలపై దాడి చేస్తున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకుపోయారు. రాత్రి వేళలో రహదారులపై వాహనాలపై వెళ్తున్న వ్యక్తులపైకి కుక్కలు పరిగెత్తుతున్నాయి. ఇలాంటి సంఘటనలు సిద్దిపేట జిల్లాలో ఇప్పటికి 14 సంఘటనలు గజ్వేల్, ములుగు, ప్రజ్ఞాపూర్, దుద్దెడ, సంగాపూర్, వర్గల్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ కాలనీ, పాతూర్, పాములపర్తి, గౌరారం, ధర్మారెడ్డి పల్లి, పిడిచెడు తదితర గ్రామాల్లో సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

వికారాబాద్ కలెక్టర్ దాడి హేయమైన చర్య

నవతెలంగాణ-కోహెడ

వికారాబాద్ జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులపై జరిగిన దాడి హేయమైన చర్య అని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ సురేఖ డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా రాష్ట్ర, జిల్లా రెవిన్యూ సంఘం ట్రేస పిలుపు మేరకు కార్యాలయ ఆవరణలో సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ట్రెసా అధ్యక్షులు మాట్లాడుతూ ఇలాంటి దాడులను ఎవరు ప్రోత్సహించిన రాబోయే రోజులలో విధులను బహిష్కరించి దాడులకు పాల్పడ్డ వారిని శిక్షించే వరకు వదిలిపెట్టమన్నారు. రాష్ట్ర నాయకుల పిలుపుమేరకు పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో హుస్నాబాద్ ట్రెస అధ్యక్షులు భుడిది ఎల్లయ్య, మండల గిర్దావార్‌లు సురేందర్, రాములు, సీనియర్ అసిస్టెంట్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన ప్రతిపాదనతో రోడ్డు మ్యాప్ తయారు చేయాలి

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు



నవతెలంగాణ- సిద్దిపేటకలెక్టరేట్

నేషనల్ హైవే రోడ్డును నూతన ప్రతిపాదనతో అధికారులు రోడ్డు మ్యాప్ తయారు చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, మెదక్ ఎంపి రఘునందన్ రావులు నేషనల్ హైవే అధికారులతో కలిసి నూతన ప్రతిపాదిత సూర్యాపేట సిరిసిల్ల జాతీయ రహదారి 365 బి వలన ప్రభావితమవుతున్న సిద్దిపేట సమీపంలో మరిపడ పరిసర 7 గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారి నిర్మాణ డీపీఆర్‌ను తయారు చేసిన ఏజెన్సీ ప్రతినిధి మురళి ప్రొజెక్టర్ ద్వారా దుద్దెడ నుంచి సిరిసిల్ల వరకు ప్రతిపాదిత రహదారి మ్యాప్‌ను చూపించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దుద్దెడ నుండి రామంచ వరకు పల్లెటూర్ల మీదుగా వెళ్తున్న ప్రతిపాదిత రోడ్డు పై రైతులు అభ్యంతర వ్యక్తం చేస్తున్నందున 3 ప్రత్యామ్నాయ రహదారులను ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. 1, దుద్దెల నుండి రాజీవ్ రహదారిని మీదుగా సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ చౌరస్తా వరకు జాతీయ రహదారిగా అభివృద్ధి చేస్తూ756 డిజి కలపడం జరుగుతుందన్నారు. 2, రాజీవ్ రహదారి కంటే ముందే వెలికట్ట నుంచి బందారం మీదుగా సిద్దిపేట రీజనల్ రింగ్ రోడ్డు మీదుగా రామంచవరకు తెలిపారు. 3, దుద్దెడ నుంచి తుక్కాపూర్, ఘన్పూర్ మీదుగా ఇర్కోడ్ వరకు అక్కడ నుంచి 765 రహదారితో కలిసి రామంచ వరకు అని పేర్కొన్నారు. దీనిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు అబ్దుల్ హమీద్, సిద్దిపేట ఆర్డీవో సదానందం, నేషనల్ హైవే ఈఈ బలరామకృష్ణ సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం

- కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ నిమ్మ రమేష్



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచిపోయిం దని ఏడాది గడుస్తున్న ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదని కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ నిమ్మ రమేష్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొత్త పెళ్లి జంటకు రూ.లక్ష , తులం బంగారం, మహిళలకు రూ.2500, రూ.4 వేల పింఛన్ ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కౌలు రైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్ కిట్టు అడ్రస్ లేకుండా చేశారని దాని స్థలములో మరో పథకం ఇస్తామని చెప్పి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. ఉచిత ఆర్టీసీ కేవలం టికెట్లు కట్ చేసుకొని దానికే ప్రాధాన్య తీస్తున్నారని కానీ బస్సులు ఎక్కడ కూడా ప్రయాణికులకు సరిపోను లేవన్నారు. గ్యాస్ తిరిగి ఆన్లైన్ ప్రారంభించలేదన్నారు. విద్యుత్ అమలు పూర్తిస్థాయిలో కావడం లేదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ నియోజకవర్గంలో రూ.కోట్లాది అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని వాటిని తీసుకొచ్చి పనులు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. గజ్వేల్ రింగ్ రోడ్డు, గజ్వేల్ కోట మైసమ్మ రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు నిలిచిపోయినట్లు గుర్తు చేశారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లోరూ.29 కోట్లను కాంగ్రెస్ రద్దు చేసిందన్నారు. మున్సిపల్‌ని అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు. రైతు భరోసా, రైతు బీమా తో పాటు రెండు లక్షల రుణమాఫీ మర్చిపోవడానికి ఆర్థిక సామాజిక సర్వే ని ముందుకు వేసుకున్నారని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో గజ్వేల్ నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి నాయకత్వంలో గజ్వేల్ అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 177 గ్రామాలు అభివృద్ధికి నోచుకున్నాయన్నారు. రూ.170 కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ పూర్తి చేయవలసిన అవసరం ఉందన్నారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో అండర్ డ్రైనేజీ పనులకు.రూ99 కోట్లు కేటాయించగా వాటిని ప్రభుత్వం పనులు పూర్తికాకముందే రద్దు చేసింది అన్నారు. మున్సిపల్‌లో, గ్రామాల్లో అండర్ డ్రైనేజీ ప్రారంభించలే దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని చర్యలు తీసుకోవాలన్నారు.

బీసీ-ఏ కులాలకు రిజర్వేషన్ పెంచాలి



నవతెలంగాణ-రాయపోల్

వెనుకబడిన తరగతుల సామాజిక, న్యాయం, ఆర్థిక, రాజకీయ, విద్య ఉపాధి అవకాశాలు కోసం, గ్రూప్ మార్పిడి సమాన అవకాశాలు కల్పిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ఏ కులాల రిజర్వేషన్ పెంచాలని బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ప్రొఫెసర్ బాగయ్య అన్నారు. మంగళవారం హైదారాబాద్‌లో బీసీ డెడికేటెడ్ కమిటీ చైర్మెన్ వెంకటేశ్వర్లు కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ఏ కులాల రిజర్వేషనులు పెంచాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం జనాభా ఉన్న సంక్షేమం కోసం కేవలం 25 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పించారు. అట్టి రిజర్వేషన్ 50 శాతంకు పెంచి అందరికీ అవకాశాలు కల్పించాలి. కేవలం 5 శాతం ఉన్న అగ్ర కులాలకు 10 శాతం ఈబిసి రిజర్వేషన్ కల్పించి బీసీలకు అన్యాయం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ తగ్గించారు, బీసీలకు 50 శాతంకు పెంచి అందులో ఏబీసీడీ గ్రూప్ రిజర్వేషన్ కల్పించి అంతర్గత 50 శాతం మహిళ రిజర్వేషన్ కూడా ఏబీసీడీ చేయాలి. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ కేవలం బీ, డీ గ్రూప్ వారికే అవకాశాలు ఉన్నాయి.ఏ గ్రూప్ వారికి ఖచ్చితముగా ఇప్పుడున్న 7 శాతం 15 శాతంకు పెంచి, నామినేటెడ్ పోస్టులలో అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీఏ కులాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల నర్సింలు, పోలీస్ బ్యూరో సభ్యులు బయ్య సాంబయ్య, ముఖ్య సలహాదారులు సాంబమూర్తి, కోశాధికారి ఏఎల్ సుధాకర్ సంచార జాతుల నాయకులు పాల్గొన్నారు.

లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించాలి

- డీఆర్డీఓ జయదేవ్ ఆర్య



నవతెలంగాణ-నంగునూరు

గ్రామ సంఘంలో జరిగే లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం నంగునూరు మండల పరిధిలోని ముండ్రాయి గ్రామంలో గ్రామైక్య సంఘం సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మహిళలు వ్యాపారాలపై మొగ్గుచూపి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. గ్రామాలలో వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకు ద్వారా వీవో ద్వారా మహిళలకు తక్కువ వడ్డీలో రుణాలు అందజేస్తున్నామని అన్నారు. ఈ రుణాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలు అభివృద్ధి చెందాలని సూచించారు. మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించిందని తెలిపారు. లోన్ తీసుకొన్న సభ్యురాలు మరణిస్తే రెండు లక్షల వరకు లోన్ బీమా వర్తిస్తుందని, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సంఘం పుస్తకాలు మీ బుక్ కీపర్ ల ద్వారా ఎప్పటికప్పుడు వ్రాయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎన్. మహిపాల్, సీసీ బాలకిషన్, వివోఏ గ్రామ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మహిళలు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ పంటకు భారీ డిమాండ్

- మండల వ్యవసాయ అధికారి నరేష్



నవతెలంగాణ-రాయపోల్

రైతులు ఒకే రకమైన పంటలు పండించే బదులు పంట మార్పిడి చేస్తూ వాణిజ్య పంటలు పండిస్తూ ఉత్పత్తి పెంచుకొని లాభాలు పొందాలని ఆయిల్ ఫామ్ సాగు అధిక ఆదాయం పొందవచ్చని దేశవ్యాప్తంగా ఆయిల్ ఫామ్ పంటకు భారీ డిమాండ్ ఉందని రాయపోల్ మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం టెంకంపేట ఆయిల్ ఫామ్ పంటలను, కొత్తపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ప్రాంతంలో ఆయిల్ ఫామ్ పంటల సాగు తక్కువగా ఉండేదని ప్రస్తుతం ఇక్కడ కూడా పంటను సాగు చేయడం జరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ పంటల ద్వారా అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ లో నీటి యాజమాన్యాన్ని సరైన పద్ధతిలో పాటించడం వలన అధిక దిగుబడులు పొందవచ్చు. రైతులందరూ ఆయిల్ ఫామ్ సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఐదు ఏండ్ల తర్వాత ఆయిల్ ఫాములో కోకో పంట కూడా వేసుకోవచ్చు. దీనివలన అధిక లాభాలు నికరంగా ఎకరానికి లక్ష వరకు ఆదాయం పొందవచ్చన్నారు.ఆయిల్ ఫామ్ తోటలో మూడేండ్ల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు. మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు, ధనియాల వంటి అనేక పంటలు సాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా ధాన్యం విక్రయించాలని రైతులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. దళారులు నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రజిత, ఐకెపి సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞులైన యువత రాజకీయాల్లోకి రావాలి

- మాజీ డీఎస్పీ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి గంగాధర్



నవతెలంగాణ-సిద్దిపేట

తాను ఉద్యోగ కాలంలో సమాజంలో జరుగుతున్న అంశాలపై మార్పు రావాలంటే విజ్ఞులైన యువత రాజకీయాల్లోకి రావాలని, సంచార జాతిలో జన్మించి, ఉన్నత ఉద్యోగం సాధించి, ఉద్యోగాన్ని సైతం వదులుకొని ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశంతోనే పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని ఎమ్మెల్సీ అభ్యర్థి మధనం గంగాధర్ తెలిపారు. మంగళవారం ప్రెస్ క్లబ్ లో ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచి భిక్షువుగా, బాల కార్మికుడిగా, పేపర్ బాయ్‌గా పనిచేసి ఎస్సైగా ఉద్యోగం సాధించి, డీఎస్పీ వరకు ప్రమోషన్లు పొందానని తెలిపారు. తన సర్వీసులో 200 అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్నానని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యువ నాయకత్వం అవసరం ఎంతో ఉందని వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నానన్నారు. తాను రాజకీయాల్లోకి రావడానికి ఉద్యోగ జీవితంలో ఎదురైనా అనుభవాలు ప్రధాన కారణమన్నారు. నాకు తోచిన విధంగా సోషల్ సర్వీస్ చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రజా క్షేత్రంలోకి వస్తె ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుందనే ఆలోచన తో వచ్చనని తెలిపారు. సమాజంలో వ్యవస్థలో మార్పు రావాల ని కోరుకుంటూ పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని, విద్యావంతులందరూ తనను ఆదరించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోతే శ్రీనివాస్, నరేష్, యాదగిరి, ఉప్పలయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగద్దు



నవతెలంగాణ-నంగునూరు

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య అన్నారు. మంగళవారం నంగునూరు మండల పరిధిలోని పాలమాకుల, ముండ్రాయి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఏది కొదువ లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస అవసరాలు నీళ్లు, కరెంటు, నీడ ఏర్పాటు చేయాలని అన్నారు. ఇప్పటివరకు మండలంలోని ఐకెపీ ద్వారా ఏర్పాటు చేసిన ఏడు సెంటర్లలో మూడు వందల పన్నెండు మంది రైతుల నుంచి 13934 క్వింటల్స్ ధాన్యం కొనుగోలు చేశామన్నారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ధాన్యం విక్రయించి మద్దతు ధర ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320 లు, కామన్ గ్రేట్ ధాన్యానికి రూ. 2300 లు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎన్. మహిపాల్, సీసి బాల కిషన్, వీఓఏ వెంకటేశం, కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ పనులు త్వరితగతిన ముగించాలి

- ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

రాష్ట్ర ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ పనులను వేగవంతం చేయాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి అధికారులను ఆదేశించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్మిస్తున్న పామాయిల్ ఫ్యాక్టరీ పనులను ఆయిల్ ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీ, అన్ని వసతులతో కూడిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని నర్మెటలో నిర్మించడం జరుగుతుందన్నారు.ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీలో నూనె ఉత్పత్తి చేయడమే కాదని రిఫైనరీని పెట్టి ఫైనల్ ప్రొడక్ట్‌ను ఇక్కడ నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపడం జరుగుతుందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వేగవంతం చేసి వచ్చే జూన్ వరకు రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు పని చేయాలని అధికారులను ఆదేశించారు.

రాజకీయ నాయకుల భూముల కోసమే రోడ్డు మార్గం

-రైతులు

నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్



ఎన్సాన్పల్లి నుంచి వేస్తున్న హైవే రోడ్డు వారి రాజకీయ నాయకుల స్వార్థం కొరకు మమ్ములను బలిపశువులను చేస్తున్నారని మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఎంపీ ఎం రఘునందరావుకు ఐదు గ్రామాల రైతులు వినతి పత్రం ఇచ్చినారు. అదేవిధంగా దుద్దెడ నుంచి మల్యాల వరకు మాత్రమే 20 కి.మీ రోడ్డును పూర్తి కొత్తదిగా హైవేగా మిగతా రోడ్డు సూర్యాపేట నుంచి దుద్దెడ వరకు పాత రోడ్డును వెడల్పు చేసినారు. మల్యాల నుంచి సిరిసిల్ల వరకు పాత రోడ్డును వెడల్పు చేస్తున్నారని తెలిపారు. రైతులకు నష్టం కలుగకుండా మార్గాలకు అనుసంధానం చేయవలసినదిగా ఐదు గ్రామాల రైతులు కోరారు. పూర్తిగా రద్దు చేసి ఓఆర్ఆర్ బైపాస్ రోడ్డుకు అనుసంధానం చేయగలరని కోరుతున్నారు. గ్రామం ఎన్సాన్పల్లి, తడకపల్లి బూరుగుపల్లి, చిన్న గుండవెల్లి, పుల్లూరు, గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తపరుస్తూ ప్రభుత్వ న్యాయం చేయాలని వేడుకున్నారు.

సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

-గజ్వేల్ మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ

నవతెలంగాణ-గజ్వేల్



సీసీఐ కేంద్రాలను పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సీసీఐ అసోసియేషన్ ఇటీవల పత్తి కొనుగోలును నిలిపివేసి ప్రభుత్వం చర్చల తర్వాత తిరిగి మంగళవారం నుంచి కొనుగోలు ప్రారంభించినట్లు తెలిపారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రైతులు పత్తి మార్కెట్ లోనే పత్తిని విక్రయించుకొని మద్దతు ధర పొందాలన్నారు.ఇంటి వద్దనే పత్తిని ఆరబెట్టుకొని తేమశాతం 12 లోపు ఉండేలా చూసుకోవాలిని కోరారు. సీసీఐ రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తుందని చెప్పారు. గజ్వేల్, జగదేపూర్ మండలాల్లో సీసీఐ కేంద్రంలో అందుబాటులో వచ్చినట్టు పేర్కొన్నారు. దళారుల మాటలు విని రైతులు నష్టపోవద్దని చెప్పారు. ఆధార్ కార్డు లింక్ ఉన్న ఫోన్ నెంబర్ సైతం సీసీఐ కేంద్రానికి తీసుకురావాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-సిద్దిపేట

హౌసింగ్ బోర్డు 11 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏడిఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ, టీచర్స్ కాలనీ, ప్రియదర్శిని నగర్, మధురానగర్, బ్యాంక్ ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోదారులు, పరిశ్రమల వారు తమకు సహకరించాలని కోరారు.

చెరువులో చేపపిల్లల విడుదల



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని గుండారెడ్డిపల్లి సింగరాయ ప్రాజెక్ట్‌లో జిల్లా మత్స్య శాఖ డీఎఫ్‌వో వర్ధారెడ్డి గ్రామస్థులతో కలిసి గ్రామ చెరువులో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షుడు, మాజీ సర్పంచ్ సుతారి కనుకరాజు, సింగరాయ ప్రాజెక్ట్ కార్యదర్శి కొత్తూరి యాదగిరి, గ్రామశాఖ అధ్యక్షుడు మేడవేని పర్శరాములు, డైరెక్టర్స్, సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో గుర్తుతెలియని మృతదేహం

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గుర్తుతెలియని మృత దేహం మంగళవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని ప్రధానరోడ్డు పక్కన గల బావిలో మగ వ్యక్తి మృతదేహం (40) మంగళవారం గ్రామస్థులు చూసినట్లు తెలిపారు. అతడు నలుపు రంగులో ఉండి సుమారు 5.3 పొడవు కలిగి ఉన్నాడన్నారు. అలాగే అతని ఒంటిపై ఎలాంటి వస్తువులు లేవని తెలిపారు. పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు.

మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని మోయతుమ్మెద వాగు మీదుగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం ఎస్సై అభిలాష్ పట్టుకున్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న వాహనాన్ని పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు.

సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

-డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్

నవతెలంగాణ-సిద్దిపేట



ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు సిద్దిపేట నియోజకవర్గంలో పలువురు లబ్దిదారులకు సీఎం ఆర్ఎఫ్ చెక్కు పంపిణి చేసినట్లు డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజ్ యాదవ్ తెలిపారు. మంగళవారం అయన మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యంతో ఆసుపత్రిపాలై ఆపరేషన్ల కోసం డబ్బులు చెల్లించే పరిస్థితి లేనట్లయితే ఎల్ఓసి ద్వారా పేదలకు ఉచితంగా ఆపరేషన్‌లు మంత్రి దామోదర్ రాజనర్సింహ చేపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ది దారులు కసబోయిన రజిత ,అజయ్, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓగా బండి నర్సమ్మ సేవలు ఎనలేనివి

నవతెలంగాణ-రాయపోల్

దౌల్తాబాద్, రాయపోల్ రెండు మండలాల్లో మండల విద్యాశాఖ అధికారిగా బండి నర్సమ్మ సేవలు ఎనలేనివని పాఠశాలల అభివృద్ధి, నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ఆమె చేసిన కృషి మర్చిపోలేనిదని మండలాల విద్యాశాఖ అధికారులు సత్యనారాయణ రెడ్డి, కనకరాజు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం ముబారస్ పూర్ ఎంటీఆర్ ఫంక్షన్ హాల్‌లో బదిలీ అయిన ఎంఈవో, ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు మండలాలకు విద్యాశాఖ అధికారిగా గత 9 ఏండ్లుగా ఏనలేని సేవలందించి ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా దుబ్బాక మండలం బదిలీపై వెళ్లడం చాలా బాధాకరమన్నారు. రెండు మండలాల్లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు, నూతనంగా మండలాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండలాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, గెజిటెడ్ ప్రధానోపా టధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంఐఎస్‌లు, పాల్గొన్నారు.



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో కీలకం

- తొగుట సిఐ షేక్ లతీఫ్

నవతెలంగాణ- రాయపోల్



గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చని, నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో సిఐ సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొద్ది రోజుల నుంచి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాలలో దొంగతనాలు జరుగుతున్నాయని,ఆ దేవాలయాలలో, గ్రామాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో నిందితులను పట్టుకోవడం కష్టమవుతుందన్నారు. గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ సీసీ కెమెరాల యొక్క ప్రాధాన్యత, నేరాల నియంత్రణ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దొమ్మాట గ్రామ ప్రజలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ప్రధాన కూడలిల్లో, ఆలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని గ్రామాల్లో కెమెరాలు ఉన్నప్పటికీ అవి సరిగ్గా పనిచేయడం లేదని వాటికి మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలు కాపాడటంలో నేరాలు నియంత్రించడంలో ప్రజలు పోలీస్ శాఖ వారికి సహకరించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువత గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్, గ్రామ యువకులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురుకి రిమాండ్

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ పట్టణంలో గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం తూప్రాన్ ఎస్సై శివానందం తూప్రాన్ లోని శ్రీ లక్ష్మి నరసింహ వెంచర్‌లో గంజాయి అమ్ముతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు తన సిబ్బందితో గంజాయి అమ్ముతున్న ప్రాంతాలపై దాడి చేశారు.పోలీసుల దాడిలో దొరికిన గంజాయి అమ్ముతున్న నలుగురు యువకులు తూప్రాన్ పట్టణానికి చెందిన నీలం అజయ్ (21), సామగారి లోకేష్ (18), మామిండ్ల తరుణ్ (20), అమిత్‌లను పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుండి పాటు 300 గ్రాముల ఎండు గంజాయి పట్టుకోని నార్కోటిక్ డ్రగ్ అండ్ సైకో ట్రోఫేక్ ఆక్ట్ ప్రకారం కేసునమోదు చేసి, జుడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 3 సెల్ ఫోన్లు, గంజాయి ప్యాకెట్లను పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. గంజాయి అమ్ముతున్న వ్యక్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ రంగకృష్ణ, ఎస్సై శివానందం, పోలీసు సిబ్బంది, తదితరులను డీఎస్పీ అభినందించారు.

అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు

నవతెలంగాణ-సిద్దిపేట



జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి శ్రీనివాస మూర్తి ఆదేశాలతో గంజాయి అమ్ముతున్న రన్న అనుమానిత ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించినట్లు సిద్దిపేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ నగర్, మెడికల్ కాలేజీ చుట్టుపక్కల, ఇతర గంజాయి అనుమాన ప్రదేశాల్లో, పోలీసు వారి సహకారంతో స్నిఫర్ డాగ్ అయిన మెస్సీ చేత తనిఖీలు నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. యువత గంజాయికి దూరంగా ఉండాలని, దానివల్ల కలిగే పరిణామాలు, గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవితాలు ఎలా చిన్నాభిన్నం అవుతాయో తెలపడం జరిగిందన్నారు. ఎవరైన గంజాయి సేవించిన, రవాణా చేసినా, అమ్మినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా ఈ చర్యలకి పాల్పడితే మాకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీల్లో సబ్ ఇన్స్పెక్టర్ కిరణ్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్స్ బాలమని, రవి, మౌనిక, స్నిపర్ డాగ్ స్క్వాడ్ అజయ్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-తొగుట



మృతుని కుటుంబానికి బియ్యం అందజేశామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. మంగళవారం మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన చిక్కుడు నరసయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జి చేరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశానుసారం మృతుని కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చెరుకు విజయ్ రెడ్డి(అమర్), మండల ప్రధాన కార్యదర్శి చిక్కుడు ఉప్పలయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు లింగాల కృష్ణ, గ్రామ అధ్యక్షులు బర్రింకల స్వామి ముదిరాజ్, దూలం నరస గౌడ్, చిక్కుడు గోపాల్, చిక్కుడు భాస్కర్, చెరుకు మధుసూదన్ రెడ్డి, చిక్కుడు స్వామి, బోయని స్వామి తదితరులు పాల్గొన్నారు.

సాహితీ పురస్కారం అందుకున్న ఎన్నవెళ్ళి రాజమౌళి

నవతెలంగాణ-సిద్దిపేట



బాలసాహిత్యంలో విశేషకృషి చేస్తునందుకు గాను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ 2022 సంవత్సర సాహితీ పురస్కారం సిద్దిపేటకు చెందిన ప్రముఖ బాలసాహితీవేత్త ఎన్నవెళ్ళి రాజమౌళి మంగళవారం అందుకున్నారు. పురస్కారంతో పాటు 20వేలతో ముఖ్యఅతిధి కే. వి రమణ, తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు వెల్దండ నిత్యానందరావు, పూర్వ ఉపాధ్యక్షులు కిషన్ రావులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలసాహితీవేత్త పైడిమర్రి రామకృష్ణ, ఐతా చంద్రయ్య, ఉంద్రాళ్ళ రాజేశం, వరుకోలు లక్ష్మయ్య, పెందోట వెంకటేశ్వర్లు, డబ్బికార్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా గోమాతకు సీమంతం



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ పట్టణ కేంద్రంలోని రామాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ అధ్యక్షులు, ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల అధ్యక్షులు జగ్గయ్యగారి శేఖర్ అధ్యక్షతన వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గోమాతకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గజ్వేల్– ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మెన్ ఎన్ సి రాజమౌళి గుప్తా , వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గంప శ్రీనివాస్, వాసవి క్లబ్ యూత్ ప్రెసిడెంట్ సిద్దిపేట, అర్వపల్లి హరికిరణ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోమాతకు శ్రీమంతం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగిందని, ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తున్న గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వాసవి క్లబ్ సభ్యులను అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, నాయకులు తడక లింగం, సిద్ది బిక్షపతి, ఎర్రం శ్రీనివాస్ అయిత సత్యనారాయణ,గంగిశెట్టి వెంకటేశం, సిద్ది నవీన్, ఉమేష్ , పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారులకు ఘన సన్మానం

నవతెలంగాణ-రాయపోల్



దౌల్తాబాద్ మండల వ్యవసాయ శాఖలో గత కొన్నేండ్లుగా విధులు నిర్వహిస్తూ రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఎన్నో సేవలందించిన వ్యవసాయ శాఖ అధికారులు బదిలీపై వెళ్లడం బాధాకరమని దౌల్తాబాద్ మండల ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రం రైతు వేదికల బదిలీపై వెళ్లిన వ్యవసాయ అధికారులకు ఘనంగా సన్మానం చేసి వీడుకోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు, ఏఈఓలు ప్రవీణ్, రోహిత్, మాధవిలు చాలా రోజుల నుంచి మండల వ్యాప్తంగా రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలందించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా వీరు నలుగురు బదిలీ కావడం బాధాకరమన్నారు. వారికి ఘన సన్మానం చేసి వీడ్కోలు పలకడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్ ఫర్టిలైజర్ అసోసియేషన్ సభ్యులు నాగప్ప, లాలు, శ్రీనివాస్, సతీష్, నాగిరెడ్డి, శ్రీనివాస్, స్వామి, సుమన్ రెడ్డి, జస్వంత్ రెడ్డి, ప్రవీణ్, దుర్గా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను కొనుగోలు చేద్దాం

- హరీష్ రావు చూపిన బాటలో పోదాం
- మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

నవతెలంగాణ- సిద్దిపేట



చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను ప్రతి ఒక్కరు కొనుగోలు చేసి వారికి అండగా నిలుద్దామని మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుసేన్ అన్నారు. మంగళవారం పట్టణంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ తన నూతన ఇంటి నిర్మాణం పూర్తి అయిన సందర్భంగా ఇంటికి వచ్చే అతిథులకు సన్మానం చేసేందుకు సిద్దిపేట, దుబ్బాక చేనేత కార్మికుల వద్ద సుమారు 1500 తువాలలతోపాటు, నేతన్నలు నేసిన చీరలను సైతం కొనుగోలు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేనేత కార్మికులకు అన్ని విధాలుగా అండగా నిలిచిందన్నారు. చేనేత కార్మికులు నేసిన వస్త్రాలను కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ ఎంతో ప్రోత్సాహం అందించారన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చూపిన బాటలో నడుస్తూ, చేనేత కార్మికులకు తన వంతుగా అండగా నిలవాలన్న లక్ష్యంతో చేనేత కార్మికులు నేసిన దుస్తులను కొనుగోలు చేయడం జరిగిందన్నారు.

ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్

నవతెలంగాణ-రాయపోల్



రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌కి గుణపాఠం చెప్పి ప్రతిపక్ష హోదాను కట్టబెట్టిన వారి తీరు మార్చుకోకుండా ప్రజలను తప్పుదోవ పట్టించి మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్ లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దౌల్తాబాద్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పడాల రాములు అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతుంటే సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల జనాభా శాతం వాస్తవంగా తెలుసుకొని వారికి సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, ఉపాధి రంగాల్లో అందుతున్న రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలపై పూర్తిగా అవగాహన చేసుకుని జనాభా దామాషా ప్రకారం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేయడం కోసమే సమగ్ర కుటుంబ సర్వే చేయడం జరుగుతుందన్నారు. ఇకనైనా బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు, దౌల్తాబాద్ మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, మైనార్టీ నాయకులు అంజద్ తదితరులు పాల్గొన్నారు.

మలేషియాలో దీపావళి ఫెస్టివల్

నవతెలంగాణ-మిరుదొడ్డి



మలేషియాలో ప్రభుత్వం నిర్వహించిన దీపావళి ఫెస్టివల్ వేడుకల్లో తెలంగాణ మట్టి కళారూపం డప్పుతో ప్రదర్శన నిర్వహించారు. మంగళవారం తెలంగాణలోని డప్పు కళాకారులు బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందే భాస్కర్ టీం తో కలిసి మలేషియాలో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుదిల శ్రీధర్ బాబు పాల్గొని పల్లెల నుంచి మలేషియా వరకు వెళ్లడం తెలంగాణ కళాకారులకు ప్రత్యేకంగా డప్పు కళాకారులను అభినందించారు. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి కృష్ణకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

నవతెలంగాణ-సిద్దిపేట



వాసవి క్లబ్, వసవి క్లబ్ యూత్ సిద్దిపేట సంయుక్త ఆధ్వర్యంలో హారతి వివాహానికి మాచర్ల పెంటయ్య రాజమణి జ్ఞాపకార్థం వారి కుమారుల సహాయంతో పుస్తే మట్టెలు అందజేసినట్లు ఆర్యవైశ్య భవనం అధ్యక్షులు అయిత బాల రాజేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎస్ఎస్ సిద్దిపేట సలహాదారులు కొమురవెల్లి అంజయ్య, ఐపీసీ గంప కృష్ణమూర్తి, జోన్ చైర్మన్ చింత రాజేంద్రప్రసాద్, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ చకిలం రవి, యూత్ క్లబ్ అధ్యక్షుడు అర్వపల్లి హరికిరణ్, శివ సంతోష్, సోమ దుర్గయ్య, సూర్యం వారి కుటుంబ సభ్యులు నాగరాజు, శ్రీనివాస్, ఆంజనేయులు, శివకుమార్, రవిశంకర్ పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

నవతెలంగాణ-మిరుదొడ్డి



ఆపదలో ఉన్న నిరుపేద బాధిత కుటుంబాలను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు తోట అంజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన ముక్క పల్లి భారతవ్వ కుటుంబాన్ని మంగళవారం ఆయన పరామర్శించి, 25 కిలోల బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకు ఓలు ధర్మారం బాబు, ధర్మారం మల్లయ్య, నరేష్, నర్సయ్య, ఎల్లయ్య కనకయ్య, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు

మల్లన్న ఆలయ ఈవోను కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న ఆలయంలో అవినీతికి పాల్పడుతున్న ఈవోను కఠినంగా శిక్షించాలని బీజేపీ మండల అధ్యక్షులు బూర్గోజు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఆలయంలో జరుగుతున్న అవినీతి పై పలుమార్లు ఆలయ కార్య నిర్వహణ అధికారికి ఎన్ని వినతి పత్రాలు ఇచ్చిన పట్టించుకోవడం లేదనీ, అందుకు నిరసనగా ధర్నా కార్యక్రమాన్ని పార్టీ ఆధ్వర్యంలో చేపట్టామన్నారు. మల్లన్న ఆలయ ఇన్చార్జి ఈవోగా పనిచేస్తున్న బాలాజీ గత మూడేండ్ల నుంచి ప్రతి ఒక్కరినీ మభ్యపెడుతూ తన కమిషన్ల పర్వాన్ని కొనసాగించాడనీ ఆరోపించారు. 55 గదుల నిర్మాణం పనులు 3 సంవత్సరాలుగా కొనసాగుతున్న పట్టింపు లేదనీ, క్యూ కాంప్లెక్స్ నిర్మాణంలో నాణ్యత లోపాలున్న కమిషన్లకు ఆశపడి కాంట్రాక్టర్ ను మందలించలేదని, దాసారపు గుట్టకు ఆరు కోట్ల ఆలయ నిధులను వృధా చేశాడనీ, ఆలయంలో చేపట్టే ప్రతి చిన్నచితక పనికి కమిషన్ ఇవ్వాల్సిందనీ అన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగుల నియామకంలో లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డాడనీ తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో జనగామ అసెంబ్లీ కన్వీనర్ దండ్యాల లక్ష్మారెడ్డి, నాయకులు కుడి మల్లేశం, నర్రా మహేందర్ రెడ్డి, కుర్రారం బాల నర్సయ్య, గుర్రాల రాములు, దండ్యాల బిక్షపతి రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కనకయ్య ,మండల యువమోర్చా అధ్యక్షులు సానాది కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

